POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఏప్రిల్ 2021
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 38 సంచిక: 12



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవుల ఆరాధన మహోత్సవము

(12-4-2021)





# నిత్యజీవితాన్ని దేవుని రూపంగా ధ్యానించాలి

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

భగవంతుణ్ణెలా ధ్యానించాలి? హృదయంలో కమలాన్ని, దాని మధ్యలో ధ్యేయమూర్తిని ధ్యానించాలని, అందుకు శ్వాసను నియమించడం సులభమని ఎక్కువగా వింటాము. కాని అది రోజులో నియమితకాలం మాత్రమే అభ్యసించగలము. అధికంగా చేయప్రయత్నించడం ప్రమాదకరం. నిరంతరమూ ఆయనను స్మరించగల్గడం కుదిరి మనస్సుకు నిత్య జీవితంలో దురభిమానము, రాగద్వేషాలకు అవకాశం తొలగిపోవాలి. మనస్సనే సరస్సు (మానస సరోవరం) ప్రశాంతమవకుండా మనం వేస్తుండే రాళ్ళు అవే! అలా రాళ్ళు వేయకుండడం నేర్చేదాకా ఎన్ని అభ్యాసాలైనా నిరుపయోగాలే గాక, ప్రమాదకరం గూడ. ధ్యానంలో అభ్యసించిన ఏకాగ్రత, తీవ్రతలు యీ రాగద్వేషాలకు సోకి, అవి బలీయమై తమకిష్టంలేని వారికి అహితం చేయడము, సంకల్పించడముగా పరిణమిస్తాయి. "ఇట్టివి ధ్యానమభ్యసించకముందు గులకరాళ్ళంత చిన్నవిగా వుంటే, యిలా సంస్కారరహితంగా ధ్యానమభ్యసించాక కొండరాళ్ళంతవిగా పరిణమిస్తాయి. అంతకుముందు మానవసహజంగా చనువువలన మాటామాటా అనుకొన్నా దులిపేసుకొని, ఆ సమయం దాటిపోగానే తుడిచేసుకొని, వెనుకటి ఆప్యాయతలతోనే మెలగగల్గివారు గూడ ధ్యానమభ్యసించిన కొద్దీ ప్రతివారూ అతిగా అభిమానపడి ముఖం ముఖం చూచుకొని, పలకరించుకోలేని వారుగా తయారై, అట్టి మాటలనుకొనే అవసరం కలగకుండడానికి సాటివారి నుండి దూరంగా వుండనారంభిస్తారు. "ఇతరులు నీతో పరుషముగా మాట్లాడినా కోపించకు, అవేమీ నీకు గుచ్చుకోవుగదా? ఎవరినీ నీ శత్రువులుగా తలచవద్దు. మాటకు మాట అప్పచెప్పకు. అలా చేస్తే నన్నెంతో బాధ పెట్టినవాడవవుతావు" అని సాయి చెప్పిన పగటి సూర్యునివంటి జ్ఞానవాక్యాలు గూడ భూమి యొక్క నీడ వలన ఏర్పడిన చీకటి రాత్రిలా మన అహం మనకే కమ్మి దానిమాటున మరుగుపడతాయి. అంతటితో ఎంత ఆత్మీయులతోనైనా మనం ప్రేమతో, నిష్కపటంగా వ్యవహరించలేక యుక్తితో తెలివిగా, లౌక్యంగా వ్యవహరించడంగా పరిణమిస్తుంది. ఇదే నేటి ఆధ్యాత్మిక సంస్కృతియంతా! ఆవగింజంత మాటపడవలసి వస్తుందన్న భయంతో మేరు పర్వతమంతటి మహత్కార్యం మలయ మారుతమంతటి సులభంగా నెరవేర్చే అవకాశమున్నా పూనుకోనివ్వదు. నిష్కపటంగా, శ్రేయఃకామంతో ఒకరి తప్పులనొకరం చెప్పుకొని సంతోషంగా ఒకరినొకరం సంస్కరించుకొనడం మాని, దుడుసుతనమూ, కపటంతో ఒకరి అనర్హతలనొకరం కప్పిపుచ్చుకొని స్తుతించుకొనడమనే జాడ్యం నికృష్టమైన లౌకిక జీవితంలోనే గాక పరమ పవిత్రము, ప్రేమమయమూ గావలసిన ఆధ్యాత్మిక జీవితంలో గూడ నేడు కన్పిస్తున్నది. పొరుగింటి వారితో కష్టసుఖాలను పంచుకొనడం, ఒకరినొకరు ఆదరించుకొనడం మాని, యావజ్జీవకారాగార వాసులులాగ జీవించడం నేటి సంస్కృతియైంది. ప్రతి ఒక్కరు ఎవరిని వారు గృహ

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:38 ఏప్రిల్-2021 సంచిక:12

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | నిత్యజీవితాన్ని దేవుని రూపంగా ధ్యానించాలి | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | అవధూత శ్రీ చివటం అమ్మ | శ్రీమతి టి.శారదా వివేక్ | 06 |
| 03. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 10 |
| 04. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 11 |
| 05. | సమాజశ్రేయస్సుకు పాటుపడటమే ధర్మం! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 13 |
| 06. | సౌజన్యమూర్తి | శ్రీ ఎమ్. గోపాల కృష్ణమూర్తి | 15 |
| 07. | నానాసాహెబ్ చందోర్కర్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 19 |
| 08. | ద్వారకామాయి అనుభవమండపము | కె.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ; వై.శివరామకృష్ణ | 24 |
| 09. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి కల్పన ; ఒక భక్తురాలు | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

నిర్బంధంలో వుంచుకొంటున్నారు. ఇక సాటి జీవులలో సజీవమూర్తిగా సాయిని దర్శించేబదులు వారందరినీ నిర్జీవమైన చిత్రపటాలుగా, విగ్రహాలుగా చూచే విపరీత సాధనగా జీవితం పరిణమిస్తున్నది. మమతలనే పిందెలు సజీవంగా పెరిగి, ప్రేమయనే పండ్లయ్యే బదులు, మమతలనే మొగ్గలు చక్కగా వికసించి ప్రేమయనే మల్లెలుగా విరిసే బదులు, సాయి చెప్పినట్లు పురుగు పట్టిన మామిడి పూతగా రాలిపోతారు.

ఇలా గోరుచుట్టు లాంటి, క్యాన్సర్ వ్యాధి వంటి దురభిమాన మెరిగిన పట్టణ వాసులు, విద్యావంతులూ, పండితులూ అందుకే ఎంతటి మహనీయుల సన్నిధిలో గూడ ఎక్కువ పరిణతి చెందలేదు సరిగదా అన్ని మత సంప్రదాయాలనూ కరుడు గట్టుకుపోయిన, హృదయం లేని బాహ్యాచరణగా రూపొందించారు. మరొకవంక నిత్యజీవితంలో ఎన్ని నిందలైనా ప్రేమతో సహిస్తూ, సాటివారిని మమతతో హత్తుకొని తర్వాత ప్రేమ తత్త్వంగా పరిణమించిన చివటం అమ్మ, అవధూత పిచ్చమ్మ, రంగన్న బాబుగారు, కబీరు, కేవలం కుండలు చేసుకున్న గోరా కుంభారు, తిన్నడు, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి యిలా ఆధ్యాత్మికవేత్తలందరూ యిట్టి అంతరంగిక మృతికి గురికానివారే. అందుకే ఏసు భగవంతునితో అన్నాడు: "నీవు తెలియని వారికి తెలుస్తావు; తెలిసిన వారికి తెలియవు" అని.

ఇటు జీవన కళ, మానవత్వము, సాధనా గూడ వెక్కిరింతలలు వేయడానికి కారణం నిత్యజీవితంలో సాటివారితో హాయిగా కలసి ప్రేమను పంచుకుంటూ, వివేకంతో సాయి చెప్పిన రీతిన అసూయాద్వేషాలను తొలగించుకుంటూ హృదయాన్ని శుద్ధి చేసుకొనకుండా సాధనకు ఉపక్రమించడమే. చివరికది సాటివారందరినీ సాధించడంగా మాత్రమే పరిణమిస్తుంది. సాధకుని హృదయాన్ని పై చెప్పిన రీతిన సంస్కరించుకొనడం మొదటి అవసరం. దీనినే సత్త్వగుణము, దైవీసంపద అలవరచుకొనడంగా భగవద్గీత చెప్పినది.

ఇలాంటి సంస్కారం కల్గాలంటే నిత్యజీవితంలో బాహ్యప్రజ్ఞతో జీవిత నిర్వహణ చేసుకొంటూనే, ప్రపంచంలో వ్యవహరిస్తూనే, భగవంతుని సర్వగతునిగా స్మరించడం నేర్వాలి. ఇందుకు సౌలభ్యంగానే భగవద్గీతలో విభూతియోగం చెప్పాడు. ఎలా చేయాలనడానికి సూచనలలో ఒకటిగా కృష్ణుడన్నాడు- "లోకస్మి" - "నేను కాల స్వరూపిని" అని. కాలాన్ని భగవత్స్వరూపంగా ధ్యానించవచ్చు. కాలమే ప్రతి వస్తువుకూ, జీవికీ పుట్టుక, వృద్ధి, క్షయము, నాశనము, సుఖదుఃఖ రూపమైన కర్మఫలము, చిత్తశుద్ధితో చేసే సాధనకు ఫలమూ గూడ కల్గిస్తుంది. ఇవన్నీ భగవంతుని విభూతులే. అటు సృష్టి, ప్రళయాల దగ్గరనుండి, జన్మ పరంపరలనుండీ, జనన మరణాలు, సంవత్సరాలు, ఉత్తర దక్షిణ ఆయనాలు, శుక్ల కృష్ణ పక్షములు, చివరకు అహోరాత్రులు కూడా కాలం యొక్క విభూతులే. దీని రూపంగా ధ్యానించి ఆరాధించడానికి కొన్ని మాసాలలో కొన్ని పర్వదినాలు దివ్యమాసాలు నిర్ణయించారు. అలానే రోజులో త్రిసంధ్యలు నిర్ణయించారు. చివరకు ఉచ్ఛ్వాస నిశ్వాసరూపమైన హంసలుగా దాని సూక్ష్మక్రియలను గుర్తించి ధ్యానించే మార్గం పెద్దలేర్పరచారు. ఒక్కొక్క సంకల్పం పుట్టి లయించడాన్ని గుర్తించడమనే సాధనగా బుద్ధుడు చెప్పాడు. ఐదు నమాజులు, రంజాన్ మాసముల రూపంలో ముస్లింలు, క్రిస్మస్ ఈస్టర్ వంటి ఋతువులు, ఆదివారం వంటి రోజులుగా క్రైస్తవులు ఆరాధిస్తారు. అందుకే విష్ణుసహస్రనామంగూడ పరమాత్మను 'అహః' 'సంవత్సరః' అని కీర్తించింది.

అందుకే సాయి తమ నామావళిలో అయనాయ నమః' త్రికాలజ్ఞానమః' అని వ్రాయించుకొన్నారు. మనకు కాలముంటుంది గాని కాలానికి కాలముండదు. కాలమెపుడారంభమైంది?" అన్నది సరియైన ప్రశ్నగాదు. అది శాశ్వతము - పరమాత్మ గనుక. అది సర్వానికి కారణమే గాని దానికి కారణం లేదు. అది స్వతస్సిద్ధమైనది 'దేశ-కాలము' అన్న సమరసము ఒక్కటే సత్యమని ఐన్‌స్టీన్ వంటి భౌతిక శాస్త్రజ్ఞుడు గూడ కనుగొని ఆ వైజ్ఞానిక రంగాలలో శక కర్త అయ్యాడు. అందుకే సాయి తమ నామావళిలో 'కాలరహితాయ నమః, శాశ్వతాయ నమః అని గూడ నా చేత వ్రాయించుకున్నారు. నూత్న జన్మదినారంభాన్ని ఇలాధ్యానించాలి; నిత్య జీవితాన్నిలా భగవంతుని ప్రత్యక్ష రూపంగా ధ్యానించడానికి దీక్ష గైకొని యిటు మన జీవితాన్ని, అటు సాధననూ గూడ వికసింప చేసుకొనడానికి దీక్షాబద్ధులమవవలసిన తరుణమే ఈ శ్రీరామ జనన సమయం.●

# అవధూత శ్రీ చివటం అమ్మ

(గత సంచిక తరువాయి)

శ్రీమతి టి.శారదా వివేక్

"అవధూతావస్థలో ఉన్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించక, అందరికంటే మహోన్నతమైన స్థితిలో ఉంటారు. అట్టి పరిపూర్ణమైన అవధూత శ్రీ చివటం అమ్మ" అంటూ పూజ్య శ్రీ భరద్వాజ మాస్టర్ గారిచే కొనియాడబడిన అమ్మ జీవిత చరిత్రను ఆగష్టు 2019 సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. -ఎడిటర్

## మహాత్ములతో అమ్మ - 2

### అమ్మ-ఇతర మహాత్ములు

శ్రీ మళయాళ స్వామి వారు ఒక ఉపన్యాసంలో అమ్మ గురించి ప్రస్తావిస్తూ, "అమ్మ పూర్ణావధూత" అని చెప్పారు.

చివటంలో మళయాళ స్వామి ఆశ్రమం వుంది. అందులో శ్రీ బాల బ్రహ్మానందస్వామి అనే స్వాముల వారున్నారు. అమ్మ, బాలబ్రహ్మానందస్వామి గురుబంధువులు. వారి యెడల అమ్మ ఎంతో గౌరవం చూపేవారు. ఆ స్వామి అమ్మ గురించి ప్రస్తావిస్తూ, "అమ్మ అంటే ఏమనుకున్నారు? అమ్మ పరమహంస! అమ్మకు సాటి ఎవరూ లేరు" అన్నారు. అమ్మ వారిని 'తమ్ముడూ' అని సంబోధించేవారు. ఆ స్వామి తర్వాత పక్షవాతం వచ్చి బాధపడుతున్నప్పుడు అమ్మే స్వయంగా వారి మలమూత్రాదులు కడిగి సేవ చేసేవారు.

బ్రహ్మానందస్వామి ఒకసారి కట్టా సత్యం గారితో, "నీవు అమ్మను వదలకు, అమ్మ సామాన్యమైనది కాదు. అమ్మ సంగతి అమ్మ సమాధి అయిన తర్వాత గాని మీ అందరకు తెలియదు. అమ్మను మాత్రం వదలకు" అన్నారు.

అమ్మగారి గురువు శ్రీ సాధూరాం బాబాజీ. ఒకసారి సాధూరాం బాబాజీ అమ్మకు తలంటి స్నానం చేయిస్తూ, "అమ్మ నాకంటే పై మెట్టులో వుంది" అన్నారు. అమ్మ సాధూరాం బాబాజీ నిర్వహించే గురుపూజలకు వెళ్ళేవారు. ఇలా 3 సం॥లు వెళ్ళి తర్వాత మానేశారు. సాధూరాం బాబాజీ వారి గురువు కొత్తలంక యోగిగారు.

అమ్మ కొత్తలంక యోగి గారిని కూడా దర్శించారు. వారి సన్నిధిలో అమ్మ మౌనంగా కూర్చున్నారట.

ఒకసారి అమ్మ మరికొందరితో కలిసి, ముమ్మిడివరం బాలయోగిగారి దర్శనానికి వెళ్ళారు. శ్రీ బాలయోగిగారు అతి చిన్న వయస్సులోనే ఒక భూగృహంలో తపస్సుకు వెళ్ళిపోయారు. వారు ఆహారం ఏమీ తీసుకునేవారు కాదు. ఒక్క శివరాత్రి రోజు మాత్రం భూగృహం నుంచి బయటకువచ్చి, అందరికీ దర్శనమిచ్చేవారు. అమ్మ దర్శించే నాటికి బాలయోగిగారు తపస్సులో కూర్చొని సుమారు 2 లేక 3 సంIIలు అయిందట. అమ్మ వారి తొడపై తన శిరస్సు నుంచి సమాధి స్థితిలో చాలా సేపు గడిపారు. వారేమీ మాట్లాడుకోలేదు.

అమ్మ, మావుడూరి బుచ్చమ్మగారు, మాల పిచ్చమ్మగారు ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో వ్యవహరించేవారు. వీరు ముగ్గురు కలిసి శ్రీ కనకయ్య గారింట్లో ఒకరోజు భిక్ష చేశారు. అక్కడ అమ్మ ఏమీ తినకపోతే, "ఏమీ తినలేదేమే" అంటూ పిచ్చమ్మగారు అమ్మ నోట్లో ముద్దలు పెట్టి తినిపించారట. పిచ్చమ్మగారు అమ్మ ఒడిలో పడుకునేవారు.

ఒకసారి రేపల్లె చిన్నమ్మగారు, పెద్దమ్మగారు, కురుమద్దాల మాలపిచ్చెమ్మగారు మావుడూరు వచ్చారు. ఆ సమయానికి చివటంఅమ్మ కూడా అక్కడకు చేరుకున్నారు. చిన్నమ్మ తెల్లటి వస్త్రాలు, పెద్దమ్మ గోనెగుడ్డలు కట్టుకొని ఉన్నారు. అమ్మ అప్పటికే దిగంబరంగా వుండేవారు. అప్పుడు అక్కడ జరిగిన సమారాధనలో మూడు రోజులు వారంతా పాల్గొన్నారు.

మావుడూరి బుచ్చమ్మగారి మఠానికి అమ్మ తరచూ వెళ్తుండేవారు. అలానే బుచ్చమ్మగారు కూడా తరచూ అమ్మ దగ్గరకు వస్తుండేవారు. అమ్మ బుచ్చమ్మ గారికి, ముద్దలు కలిపి తినిపించేవారు.

చివటం అమ్మగారు మౌనంగా వుండేవారు. మావుడూరి బుచ్చెమ్మగారు కోపదారిగా వుండేవారు. తిట్టేవారు – కొట్టేవారు కూడా. ఒక్కోసారి ఉన్మత్తుల వలె ప్రవర్తించేవారు. ఒకసారి అమ్మ ప్రసాదం పెడుతుంటే, "నీ ప్రసాదం నీవే వుంచుకో" అంటూ అమ్మగారి మీదకు విసిరేశారు. "ఏమే అచ్చమ్మా ! నీవు బ్రతికి వుండగా నీ దగ్గరకు వస్తే నీ చెప్పుతో కొట్టు" అంటూ రిక్షా ఎక్కి కూర్చున్నారు.

బుచ్చమ్మగారు ఒక్కోసారి అమ్మను వేళాకోళం చేస్తుండేవారు. అమ్మ భక్తులతో "మీ అమ్మగారికి చిప్పట్టుకొని ఇల్లు ఇల్లు తిరగడం ఇష్టం. నాకు శుభ్రంగా ఇక్కడికే వస్తున్నాయి" అనేవారు.

ఒకసారి రామాలయంలో పుస్తకాలన్నీ చిందరవందరగా పారేసి అవి సర్దబోయినకట్టా సత్యాన్ని కాలుతో తన్నారు. చివరకు వెళ్ళిపోబోతూ, కట్టా సత్యాన్ని పిలిచి, "నిన్ను కొట్టినందుకు ఏమీ అనుకోకురా" అని కంట తడిపెట్టి, "అమ్మను విడువవద్దు" అని హెచ్చరించారు. బుచ్చమ్మగారిని చూస్తుంటే బాబా దగ్గర ఉండే నానావల్లీ గుర్తుకు వస్తారు. బుచ్చమ్మగారు ఎంత తిట్టినా, వేళాకోళం చేసినా, వస్తువులు గిరాటు వేసినా అమ్మ మాత్రం శాంతంగా, మౌనంగా వుండేవారు. చివటం అమ్మగారి కొడుకు సూరన్నగారికి బుచ్చమ్మగారే దగ్గరుండి పెళ్ళి జరిపించారట.

ఒకసారి అనంత ఏకాదశికి అమ్మ మావుడూరు వెళ్ళారు. అక్కడ చివటంఅమ్మ, మాలపిచ్చెమ్మ గారు, బుచ్చెమ్మగారు కలిసి అన్నదానము చేశారు. ఆ ఊర్లో జమిందారు గారు కూడా అదే సమయంలో భారీ ఎత్తున అన్నదానం చేయడానికి ఏర్పాటు చేశారు. కానీ, చిత్రంగా, అమ్మవాళ్ళు చేసినసంతర్పణకేజనంఎక్కువమంది రాసాగారు. అపుడా జమీందారు గారు ఆశ్చర్యపోయి వచ్చి, అమ్మగార్ల దర్శనం చేసుకున్నారు. అమ్మ గురించి బుచ్చెమ్మగారు, "నాకింకా పచ్చి వుంది. అమ్మలో పచ్చిలేదు" అనేవారు.

అమ్మ నిర్యాణానంతరం అమ్మ లేరని బాధపడుతున్న పెరవలి కరణంగారి కుటుంబ సభ్యులను బుచ్చమ్మగారు ఎంతగానో ఆదరించారు. వీరు బుచ్చమ్మగారి దర్శనానికి వెళ్ళారు. ఎవరినీ దగ్గరకు రానీయకుండా తరిమేసే బుచ్చమ్మ గారు హైమ వాళ్ళని (కరణం గారి అమ్మాయి) చూస్తూనే, 'రాండే, రాండే' అని ఆదరించారు. ఎప్పుడూ దిగంబరంగా సంచరించని బుచ్చమ్మగారు హైమకు మచిలీపట్నంలో చిలకలపూడి గుడి వద్ద దిగంబరంగా దర్శనమిచ్చి, ప్రేమతో కౌగిలించుకొని, తాను – అమ్మ వేరు కాదన్నట్లుగా ఆదరించారు.

# అవధూత శ్రీ చివటం అమ్మ



రచయిత్రి : శ్రీమతి శారదా వివేక్

తర్వాత వీరి ఇంటికి కూడా వచ్చి 2,3 రోజులున్నారు.

మహాత్ములు ఒకరి శిష్యులను మరొకరి ఆశీర్వచనం కోసం పంపడం పరిపాటి. అమ్మ శ్రీ కట్టా సత్యం గారిని కురుమద్దాలలో మాలపిచ్చమ్మ గారు తపస్సు చేసిన మర్రి చెట్టు క్రింద ఒక రాత్రి, ఒక పగలు ధ్యానం చేసుకోమని పంపించారు.

ఒకసారి శ్రీ విద్యానంద స్వాముల వారు అమ్మ దర్శనానికి వచ్చారు. రామాలయంలో అమ్మ దగ్గర కూర్చున్నారు. "అమ్మగారి స్థితి సామాన్యమైన స్థితి కాదు; మీ పూర్వపుణ్యం వలన అమ్మగారు మీ మధ్యన వుంటున్నారు" అన్నారు. స్వాముల వారిని చూడగానే వారి కాళ్ళకు సాష్టాంగ నమస్కారం చేసారు అమ్మగారు. కొంతసేపు భగవద్గీత ఉపన్యాసం చెప్పి వారు వెళ్లిపోయారు.

ఒకసారి హఠయోగి అప్పారావు గారు అమ్మ దర్శనానికి వచ్చారు. ఈయన సాధూరాం బాబాజీ గారి శిష్యులు. ఈయన నీటి మీద పడుకోవడం లాంటి యోగప్రక్రియలు చేసేవారు. అమ్మ ఆయన కాళ్ళు పట్టుకొని నమస్కారం చేసుకున్నారు. అప్పుడు, "నా కాళ్ళు పట్టుకోకు, నీవు పండి పోయావు. నాకింకా పచ్చి వుంది" అన్నారు.

కొత్తలంక యోగి గారి శిష్యులు వాడపల్లి బాబుగారు. వీరు అమ్మను దర్శించడానికి వచ్చినప్పుడు అమ్మ ఒక గోతిలో సమాధి స్థితిలో వున్నారట. తర్వాత అమ్మ మెల్లగా మామూలు స్థితిలోకి వచ్చి వారిని పలుకరించారట.

అలంపురం బాబుగారు మొదటిసారి అమ్మ దర్శనార్థం వచ్చినప్పుడాయన అమ్మతో ఇలా అన్నారట. "ఏడు మల్లెపూవుల బరువుంటావనుకున్నాను; ఇంత బరువున్నావేమిటి?" అని! అమ్మ శరీరం ఒక్కొక్కసారి చాలా బరువుగానూ, ఒక్కొక్కసారి చాలా తేలికగానూ వుండేది. మరొకసారి అమ్మ సిద్ధాపురం వెళ్ళినప్పుడు కొల్లేరులో నావ ఎక్కడానికి నడిచి వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు అమ్మను ఎత్తుకొని తీసుకు వెళదామని నలుగురు పైకి ఎత్తారట. కానీ, అమ్మ మల్లెపూవంత తేలిగ్గా వున్నారట.

మరొకసారి అలంపురం బాబుగారు అమ్మ దర్శనార్థం

వచ్చినప్పుడు, అమ్మ భిక్షాపాత్రలో మట్టి కలిపి గోడకు మెత్తుతున్నారు. ఆయన అది చూసి, "అమ్మ అవధూత కదా – గోడకు మట్టి మెత్తుకోవడం వంటి పనులీమెకెందుకు?' అని మనస్సులో అనుకొన్నారట. వెంటనే అమ్మ ఆ పని ఆపేసి వెళ్లిపోయారు. అప్పుడాయనకు పాత్రలో మట్టిని తానే గోడకు మెత్తాలనిపించి, ఆ పని ముగించారట.

అమ్మ దీపావళి ముందు రోజు నాగయోగి గారికి శ్రీ విస్సయ్య పంతులు, శ్రీ గోపాలకృష్ణల ద్వారా కాషాయరంగు తువ్వాళ్లు, కలకండా, కొబ్బరినూనె ఇచ్చి పంపారు. ఆ సాంప్రదాయాన్ని కొనసాగించాలనే ఉద్దేశ్యంతో, అమ్మ సమాధి చెందాక 14–11–82న విస్సయ్య పంతులుగారూ, వారి చెల్లి పట్టుపంచెలు తీసుకొని వెళ్ళారు. ఎవ్వరినీ లోపలకు రానీయకుండా తలుపులు వేసుకొని లోపల వుండేవారు నాగయోగి. వీరు అమ్మను స్మరించినంతనే తలుపులు తెరుచుకున్నాయి. ఎవరినీ తనను తాకనీయని నాగయోగి, వీరు తలస్నానం చేయిస్తామంటే అంగీకరించారు. వీరు స్నానం చేయించడంతోనే ఒళ్ళు తుడవనీయకుండా గబుక్కున లేచి వెళ్ళి, స్వయంగా పట్టు పంచె చుట్టబెట్టుకొని వెళ్లి కూర్చున్నారు. వీరు తీసుకువెళ్లిన ప్రసాదం ఎంతో ఇష్టంగా చేతినిండా తీసుకొని తిన్నారు.

అమ్మ సాధువులకు స్వయంగా సేవ చేసేవారు. ఒకసారి ఒక సాధువుగారు వచ్చారు. ఆయన భోజనం చెయ్యరు. ఉప్పుడు పిండి (ఉప్మా వంటిది) తింటారు. అమ్మ వారి కోసం స్వయంగా పిండి విసిరి, ఉప్పుడు పిండి తయారు చేసి పెట్టారు.

ఒకసారి పిఠాపురం బాబుగారు చివటం వచ్చారు. సెలవు తీసుకొని వెళ్ళిన వెంటనే మళ్ళీ ఆయనకు అమ్మను చూడాలనిపించింది తిరిగి వచ్చారు. ఆయన వెళ్ళాక అమ్మ భక్తులతో, "వెళ్ళిన వెంటనే మళ్ళీ వచ్చాడే! ఇక మళ్లా రాడేమోనే" అన్నారట. అలాగే అమ్మ వుండగా మళ్ళీ రాలేదు. అమ్మ సమాధి అయిన తర్వాతనే వచ్చారు.

పరుచూరి వెంకట్రామయ్యగారు గొప్ప పౌరాణికులు. శ్రీ వెంకట్రామయ్య గారు, శ్రీ కరుటూరి నారాయణ మూర్తిగారే చివటంలోని రామాలయం కట్టించారు. అమ్మ నివాసమైన ఆ ఆలయంలోకి ఎందరో మహాత్ములు విచ్చేశారు. ఒకసారి పరుచూరి వెంకట్రామయ్యగారు శాస్త్ర ప్రవచనం చేస్తుంటే, కరుటూరి నారాయణమ్మ గారిని తోడు తీసుకొని అమ్మ కూడా వెళ్లారు. అక్కడ వారి ప్రవచనం వినడానికి కొందరు సాధువులు వచ్చారు. అమ్మ వారందరికీ కరుటూరి నారాయణమ్మ గారింట్లో భోజనం ఏర్పాట్లు గావించారు.

వెంకట్రామయ్యగారు, అమ్మల మధ్య శాస్త్ర చర్చ క్షుణ్ణంగా జరిగేది. శాస్త్ర చర్చ చేసేటప్పుడు మాత్రం అమ్మ మాట్లాడేవారు. ఇతర సమయాల్లో వారితో అమ్మ ఏమీ మాట్లాడేవారు కాదట.

పరుచూరి వెంకట్రామయ్యగారు, అమ్మ ఒకే ఆకులో అన్నం తినేవారు. ఆకులో అన్నం రెండు భాగాలుగా చేసి ఒకవైపు అమ్మ రెండో వైపు ఆయన తినేవారు. అన్నం తినేటప్పుడు – ఒకరివైపు మరొకరు తమ భాగంలోని అన్నం రెండవ వారి వైపుకు నెట్టుకుంటూ తినేవారు. వెంకట్రామయ్య గారింట్లో ఆబ్దీకాల నాడు అమ్మ భిక్షా పాత్రతో వచ్చి, బ్రాహ్మణుల పంక్తిలో కూర్చుని భిక్ష స్వీకరించేవారు.

పరుచూరి వెంకట్రామయ్యగారు తాము దేహత్యాగం చేసేముందు, తమ శిష్యురాళ్ళను అమ్మకు అప్పజెప్పారు. వారు అమ్మతో, "అమ్మా ఈ ముండలను విడిచి పోతున్నానే! వాళ్లను ఏం చేస్తావో!" అన్నారు. అమ్మ మౌనంగా అంగీకరించారు.

తత్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు రాజమండ్రి వచ్చినప్పుడు అమ్మ తన భక్తులను ఆ సభలకు వెళ్ళమని ప్రోత్సహించారు. అంతేకాక, మంగమ్మ గారితో కలిసి అమ్మ కూడా ఆ సభలకు వెళ్లారు. గాంధీగారు రాజమండ్రి వచ్చి నప్పుడు కొందరు, అక్కడకు వెళదామా అమ్మా!" అంటే, 'ఎందుకులే వద్దు" అన్నారు అమ్మ.

శ్రీ లక్ష్మణ యతీంద్రులు అమ్మను దర్శించినట్లుగా తెలియరాదు – కానీ, అమ్మ సమాధిని ఒకసారి దర్శించారట!

"దేశంలో కెల్లా దిగంబరత్వం ఆధారంగా చేసుకొని వున్న ఏకైక అవధూత అమ్మ, అమ్మ నివాసం ఆలయమే. భాష యాస కావచ్చు. భావంలో అలాంటి మనిషిలేదు. అమ్మ సేవకుండే విలువ అనంతమైనది" అన్నారు ఒక గొప్ప మహాత్ములు.

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

**ప్రశ్న :- సాయి తమ గత జన్మలలో జోగ్ మొ॥న వారితో కలిసి ఒకే గురువును సేవించినట్లు, గుడ్డలు నేసినట్లు యిలా ఎన్నో రకాలుగా చెప్పిన దానినిబట్టి ఆయన జన్మాంతరంలో క్రమంగా పరిపూర్ణుడైనట్లు తోస్తుంది. సాయి దత్తావతారమనడమెలా కుదురుతుంది?**

**-చి. సుబ్బరామరెడ్డి, రేబాల**

జవాబు:-సాయి శిరిడీలో భౌతికంగా జీవిస్తున్నప్పుడు గూడ రత్తంజీ వాడియా దగ్గర ₹.3-14-0 సత్కారంగా పొందిన మౌల్వీ సాహెబ్ తానేనని, గోవాలో ₹35,000/- వంటవాని వలన పోగొట్టుకున్న వ్యక్తిని తామేనని చెప్పారు. అంతేగాదు. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో తామొక సిపాయినన్నారు. కానీ ఝాన్సీ లక్ష్మీబాయి, సాయినాథుడు సమకాలికులే. కనుక తామొక నీతి చెప్పదలచినప్పుడు అది తమపరంగా చెప్పుకొనడం దత్తావతార లక్షణమని అది వారి నిరాడంబరము, నిరహంకారతకు నిదర్శనమని తెలియాలి.

సర్వజీవుల హృదయాన్తర్వర్తియైన ఆయన ఏ జీవిగారు గనుక? మీరు పైన ప్రస్తావించిన వారి పూర్వజన్మ కథలు కూడ అలాంటివేనని తలచాలి. వాటికి తోడు ఆయన తాము కబీరునన్నారు. కబీరు వృత్తి కూడా నేతపని; ఆయన గూడ ఒక గురువు నాశ్రయించారు. కాని ఆయనగూడ అయోనిజుడుగా ముస్లిం దంపతులకు దొరికాడు. ఆయన స్పర్శ వలన గొడ్రాలైన ఆ తల్లికి స్తన్యమొచ్చింది. అదిగాక సాయి - అక్కల్కోటస్వామి ఒక్కరేనని నిదర్శన మిచ్చారు. ఆయనయే మాణిక్య ప్రభువు, నృసింహసరస్వతి. గాణగాపురంలో సంతతి పొంది మొక్కు తీర్చని భక్తునితో "నీ రాతలో పుత్రసంతాన మెక్కడిది? నా శరీరం చీల్చి నీకు మగబిడ్డ నిచ్చాను!" అని సాయి మందలించారు. కనుక ఆయన శ్రీపాద శ్రీవల్లభులే. అంటే ఆయనే దత్త ప్రభువు. అందుకే ఆయనే రామాయణ, భాగవత, భారతకథ జరుగుతున్నప్పుడు గూడ వున్నామని, స్వయంగా చూచామని, యిప్పుడెలా వున్నారో అప్పుడుగూడ అలానే వున్నామని అన్నారు. అంటే సాయి దత్తావతారమని యీ లీలలు నిస్సందేహంగా తెల్పుతాయి. అయినా ఒక సద్గురువును సేవించి వారి అనుగ్రహంవల్ల మాత్రమే తాము తరించినట్లు చెప్పి లోకానికి సద్గురుసేవ ఎంత అవసరమో తెల్పడం దత్తావతార లక్షణం. శ్రీ నృసింహ సరస్వతి గూడ తప్పనిసరి అయ్యేవరకు కేవలమొక మూగబాలుడిగా నటించడము; ఉపనయనం చేయమని కోరి గాయత్రీ ఉచ్చారణతో మాత్రమే మాట్లాడటం చూచాముగదా? అందుకే నిజానికి 'శ్రీ గురుచరిత్ర', 'శ్రీ మాణిక్య ప్రభువు చరిత్ర', 'శ్రీ స్వామిసమర్థ చరిత్ర', 'శ్రీ సాయిబాబా

*మిగతా 28వ పేజీలో*

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## ఏడవ ప్రసంగము

తరువాతి రోజున అందరూ నిత్యానంద స్వామి వారి దగ్గర కూర్చుని వున్నారు. అక్కడకు దర్బారు నుండి పాలు, మిఠాయిలు మొదలైన అనేక తినుబండారాలు పంపబడ్డాయి. ఆ తీసుకువచ్చినవారితో శ్రీ ప్రకాశానంద స్వామి వారు యిలా అన్నారు "ఈ మిఠాయిలు నాకేమీ నచ్చవు".

బేచరభాయి: మిఠాయిలు తినడానికి మీకెందుకు అభ్యంతరము?

స్వామి ప్రకాశానంద: అవును అభ్యంతరమే. ఈ ప్రసంగంలో ఒక మహ్మదీయ సత్పురుషుని దృష్టాంతము వినండి. ఆయన పేరు 'మలిక్ దినార్'. ఆయన చాలా కాలం మృష్టాన్నభోజనం చేసేవాడు కాదు. ప్రతిరోజు సాయంకాలం రొట్టెల దుకాణానికి వెళ్లి ఒక రొట్టె కొని తెచ్చేవాడు. అది తిని నీళ్ళు త్రాగి ఆ రోజు ఉపవాసభంగం చేసేవాడు. అతడు ఎంతో ఆరోగ్యంగా వుండేవాడు. ఒకసారి అజ్ఞానము వలన అతనికి పిండివంటలు తినాలనే కోరిక కలిగింది. ఎన్నో రోజులు తనను తాను నిగ్రహించుకున్నాడు. అయినా ఆశ అతనిని వెంటాడడం మానలేదు. అప్పుడు ఒకరోజున అతడు బజారుకు వెళ్లి మిఠాయిలు కొనుక్కుని ఇంటికి వచ్చాడు. మహాత్ముడైన మాలిక్ దినార్ ఆ మిఠాయిలను ఏమిచేస్తాడో చూడాలనే ఉద్దేశ్యము దుకాణపు యజమానికి కలిగింది. అతడు ఒకడిని మాలిక్ దినార్ వెనకనే పంపాడు. కొంచెం దూరం వెళ్ళిన తరువాత మాలిక్ దినార్ మిఠాయిలను బుట్టలో నుంచి బయటకు తీసి మూడుసార్లు వాసన చూసి యిలా అన్నాడు: "ఓ మనసా! నీకు ఈ మాత్రం సుఖం చాలు!" అలా అంటూ ఆ మిఠాయిలను ఒక బిచ్చగాడికిచ్చి తన మనసుకు యిలా ఉపదేశించాడు:-

"ఓ బలహీనమైన మనసా! నియమము ప్రకారము నడుచుకోవడానికి నిన్ను బాధపెట్టాలనుకున్నాను. నాకు నీ మీద ద్వేషం లేదు. నిన్ను స్నేహితుడుగా భావించడం వల్లనే యిలా చేశాను. కొద్దిరోజులు ఓపికపట్టు. ఏదో ఒక రోజున నీ దుఃఖాలన్నీ తప్పక నశిస్తాయి. నాశము లేని సుఖము కలుగుతుంది."

## సాత్త్విక పదార్థాలు

బేచరభాయి: పులుపు, ఉప్పు, కారము మొదలైన రాజసికమైన పదార్థాలు తినకూడదనే భగవద్గీతలో చెప్పివున్నారు. పాలు, నెయ్యి మొదలైనవి సాత్త్విక పదార్థాలు.

*శ్లో॥ ఆయుఃసత్త్వ బలారోగ్య*
*సుఖప్రీతివివర్ధనాః I*
*రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా*
*ఆహారాః సాత్త్విక ప్రియాః II*

భావము: ఆయుర్దాయము, శక్తి, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతి పెంపొందించేవి; రుచి కలవి, నేతితో చేసినవి, పాడైపోనివి, ఆనందాన్ని కలిగించే ఆహారాలు సాత్త్విక స్వభావం కలవారికి యిష్టమైనవి.

## యోగాభ్యాసము చేసేవారికి సాత్త్వికాహారము నిషిద్ధము

స్వామి ప్రకాశానంద: సాత్త్విక పదార్థాలని యిప్పటి సన్యాసులు లడ్డూలు, జిలేబీలు మొదలైనవి సేవిస్తూ వుంటారు. గృహస్థాశ్రమంలో వున్నవారికి యివన్నీ సాత్త్వికమైన పదార్థాలే కాని, యోగాభ్యాసము చేసేవారికి యివన్నీ నిషిద్ధాలే. భర్తృహరి మహారాజు ఈ విషయంలో యిలా అన్నాడు:-

*శ్లో॥ విశ్వామిత్రపరాశర ప్రభృతయో*
*వాతామ్బుపర్ణాశనా I*
*తేఽపి స్త్రీముఖ పఙ్కజం సులలితం*
*దృష్ట్వైవ మోహం గతాః II*

*శ్లో॥ శాల్యన్నం సఘృతం పయోదధియుతం*
*భుఞ్జన్తి యే మానవాః I*
*తేషామిన్ద్రియ నిగ్రహో యది*
*భవేద్విన్ధ్య స్తరేత్సాగరమ్ II*

భావము: విశ్వామిత్రుడు, పరాశరుడు మొదలైన మహర్షులు గాలి, నీరు, ఆకులు తినేవారు. వారుకూడా అందమైన స్త్రీ ముఖము చూడగానే మోహం చెందారు. ఇక నెయ్యి, పాలు, పెరుగు, అన్నం తినేవారికి ఇంద్రియనిగ్రహం ఎలా కలుగుతుంది? అలా కలిగితే వింధ్య పర్వతం కూడా సముద్రం మీద తేలగలదు. (అంటే ఇది అసంభవము).

## యోగుల ఆహారము

బేచరభాయి: అయితే యోగులందరూ ఆకులు, అలములు తినవలసినదేనా?

స్వామి ప్రకాశానంద: ఆకులు, అలములు తినాలని శాస్త్రాలలో లేదు. కానీ యోగాభ్యాసానికి తగిన ఆహారాన్ని భుజించాలి. భారతంలో ధర్మరాజు భీష్మ పితామహుని యోగుల ఆహారము గురించి అడిగితే యిలా చెప్పారు:-

శ్లో॥ కణానాం భక్షణే యుక్తః
పిణ్యాకస్యచ భారత ।
స్నేహానాం వర్జనే యుక్తో
యోగీ బలమవాప్నుయాత్ ॥

భావము : నెయ్యి, నూనె, మొదలైన బలము కలిగించే పదార్థాలను యోగి విసర్జించి ధాన్యపు పిండిని, రవ్వను, గానుగపిండిని భుజించాలి. అప్పుడే అతనికి ఆత్మ బలం కలుగుతుంది.

*శ్లో॥ భుఞ్జానో యావకం రూక్షం*
*దీర్ఘకాల మరిన్దమ I*
*ఏకాహారో విశుద్ధాత్మా*
*యోగీ బలమవాప్నుయాత్ II*

భావము : రుచి లేని 'యవలు' అనే ధాన్యాన్ని రోజుకు ఒక్కసారి మాత్రమే స్వీకరిస్తూ చాలాకాలం గడిపేవాడు పరిశుద్ధమైన అంతఃకరణను పొంది ఆత్మబలాన్ని సంపాదించగలడు.

- సశేషం

# సమాజశ్రేయస్సుకు పాటుపడటమే ధర్మం!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మనవద్ద ఎన్ని వైద్యగ్రంథాలున్నా, మనం వైద్యులం గానప్పుడు అవన్నీ వ్యర్థమే. వాటిని చూచి మనకుగానీ, సాటివారికిగాని చికిత్స చేసుకోబూనడం ఎంతో అవివేకం. రోగ నిర్ణయం, రోగియొక్క శరీరతత్త్వము, పథ్యము స్పష్టంగా తెలియకుంటే ఎంత మంచి మందైనా ప్రమాదించవచ్చు. అందుకే వైద్యం తెలియకుండానే చికిత్సను చేయబూనిన వారు నరకానికి పోతారని శాస్త్రం. స్థూలమైన శరీరం విషయంలోనే యిలా అయితే, అంతకంటే సూక్ష్మము సున్నితము అయిన మనస్సు విషయంలో బోధకులు ఎంతో జాగ్రత్త వహించాలి. మహనీయుల సాంగత్యంతోనూ, నిష్కామమైన కర్మ ద్వారాను చిత్తశుద్ధి సాధించకుండా, రాగద్వేషాలను, మనోవికారాలను వివేకంతో జయించకుండా ధ్యానం చేయబూనటం ప్రమాదకరమని ఋషులు చెప్పారు. అలా చేయడం చాలా కష్టం గూడాను. అదీ మన అదృష్టమే. మూర్ఛించి అలా ధ్యానము, తపస్సు చేయగలిగినా, దృఢంగా హృదయంలో దాగియున్న వికారాల మీదకు మనమేకాగ్రత సాధించుకొన్న మనస్సు పరుగెత్తి, మనకూ సాటివారికి గూడా సామాన్య మానవులుగా చేయలేని అపకారం చేస్తాము. అందుకే అలా చేసిన భస్మాసురుడు తనకెట్టి అపకారము చేయని వారుగూడ, తన చేయి వారి శిరస్సుపై పెట్టగానే వారు భస్మమై పోవాలని కోరగల్గాడు. ఈశ్వర సాక్షాత్కారం గూడ అతని హృదయాన్ని పరిశుద్ధం చేయలేకపోయింది. అది తెలిసిన మన ఋషులు, మొదట బ్రహ్మచర్యాశ్రమంలో గురుశుశ్రూష, గృహస్థాశ్రమంలో నిష్కామకర్మ, వానప్రస్థాశ్రమంలో వైరాగ్యము సాధించుకొన్నాకనే మానవులందరూ సన్యాసాశ్రమంలో నిరంతరమూ ఆత్మనిష్ఠలో నిలవాలని శాసించారు. ఇది తెలిసిన పరమగురువైన దత్తాత్రేయుడు -- శ్రీపాద శ్రీ వల్లభుడు మొదలుకొని శ్రీ శిరిడీ సాయిబాబా వరకూ గల తమ అవతారాలలో -- ఏ భక్తుణ్ణీ సర్వసంగ పరిత్యాగం చెయ్యమని ప్రోత్సహించలేదని గమనించాలి.

ఇట్టి ధర్మాన్ని ప్రజలకాదర్శంగా ఆచరించి చూపడానికే భగవంతుడు రాముడు, కృష్ణుడుగా అవతరించారు.

కురుక్షేత్రంలో అర్జునుడెంత వైరాగ్యం ఒలక బోసినా క్రిష్ణుడు అతని వాదాన్ని నిరసించి, నిష్కామంగా తన కర్మలనాచరించాలని ఆదేశించాడు. తాను సాక్షాత్తూ భగవంతుడే ఐనా, తనను తాను ఆశ్రమ ధర్మాల ద్వారా సంస్కరించుకోవలసిన అవసరం లేకున్నా, తాను మాత్రం సంసారిగా వున్నాడు. ఆయన పరమాత్మ గనక ఆయనేం చేసినా చెల్లుతుందని మనం

సమర్థించుకోవడానికి వీలులేదు. ఆ భగవంతుడే ధర్మానికంకితమైన సామాన్య మానవుడుగా అవతరించి శ్రీరాముడుగా మానవాళికి అచరణ మార్గం చూపాడు. ఋషులు, అవతార పురుషులు చెప్పినా వినకుండా సన్యాసం దగ్గర దారియని భ్రమించి, దుస్సాహసంతో దానిని స్వీకరించి యీనాడు లోకానికి ఎందుకింత ధర్మభ్రష్టత గావిస్తున్నారో! మనజాతి నిర్వీర్యమవడానికి అదే ప్రబలమైన కారణమని శ్రీ వివేకానందుడు గూడ ఎంతగానో ఘోషించాడు.

అయితే యింతకూ సామాన్యులమైన మనము గృహస్థాశ్రమంలో వుంటూ ఆచరించవలసిన ధర్మం ఏమిటి? మనకూ, కుటుంబానికి కూడు, గుడ్డ, ఆస్తి సంపాదించుకుంటూ, మిగిలిన సమయమంతా పూజలు, పునస్కారాలలో గడపడమేనా! అలా అయితే యిక నిష్కామకర్మకు తావేది? మనం చేసే పూజలు, పునస్కారాలు, నిష్కామంగా చేయడమా? అది కానేకాదు అనడానికి ఒక్కటే గుర్తు -- మన మనస్సు ఎప్పుడంటే అప్పుడు నిశ్చలంగా ధ్యానస్థం కాకపోవడమే! ఇంకొక గుర్తు రాగద్వేషాలతో సాటి వ్యక్తులపై సంశయాలు పెట్టుకొని వాటిలో మ్రగ్గడమే. ధర్మమంటే ఏమిటో కూలంకషంగా పెద్దలనుండి తెలుసుకొని, దాని సూక్ష్మమెరిగి, మనలోనూ, మన సాటివారిలోనూ అది దృఢంగా నెలకొనేలా నిరంతరమూ యత్నిస్తూండడమే, ఈ ప్రయత్నంలో జయాపజయాలను, మానావమానాలను, సుఖదుఃఖాలను నశింపచేసుకోవడమే. అలా జీవిస్తూ జీవనం సంపాదించుకొంటేనే, అది పరిశుద్ధమైన ఆహారమై మనకు సత్వశుద్ధినిస్తుంది. నిజమైన సాధన మనకు సాధ్యమయ్యేలా చేస్తుంది. ఈ ధర్మాన్ని ఎంత స్వల్పంగా ఆచరించినా భయంనుండి తరింప చేయగలదని శ్రీకృష్ణుడు చెప్పాడు. సాటివారికి ధర్మప్రబోధం చేస్తూ, మనమాచరిస్తూ, సమాజం యొక్క శ్రేయస్సు గురించి శక్తివంచన లేకుండా అవగాహనతో పాటుపడడమే ఉత్తమ ధర్మమన్నమాట. మన బిడ్డలకు, సాటివారి బిడ్డలకు ధర్మాన్ని ప్రబోధించడమే మనమాచరించవలసిన ధర్మమని పై చెప్పిన అవతార పురుషులందరూ అదే మార్గాన్ని నడచిచూపారు. అలాగాక ఆధ్యాత్మికత పేరిట భార్యాబిడ్డల క్రమశిక్షణను, సాటివారిని గురించి పట్టించుకొనకపోవడం మన స్వధర్మాన్ని పరిత్యజించడమే అవుతుంది. అలాచేస్తే, స్వధర్మాన్ని విడిస్తే - పాపము మాత్రమే సంక్రమిస్తుందని క్రిష్ణుడు చెప్పాడు. నాలుగు పురుషార్థాలకూ మూలమైన ధర్మాన్ని యిలా రక్షించుకుంటే, ఆ ధర్మమే మనల్ని రక్షించి తక్కిన మూడు పురుషార్థాలనూ సమకూరుస్తుంది.

ధర్మానికి వేరువేరు స్మృతులలో చెప్పబడిన నిర్వచనాలు చూస్తే దేశమంతటికీ సుఖశాంతులను, శక్తిసామర్థ్యాలను పెంపొందించగల విధానమే ధర్మమని తెలియగలదు. అంటే సమాజం యొక్క శ్రేయస్సు గురించి శక్తివంచన లేకుండా అవగాహనతో పాటుపడడమే ఉత్తమ ధర్మమన్నమాట. రోగియొక్క స్థితిని, మందుయొక్క లక్షణాన్ని, పథ్యాన్ని తెలుసుకొని మాత్రమే చికిత్సకు ఉపక్రమించదలచినట్లు, మనలో ప్రతి ఒక్కరమూ మన సమాజాన్ని నైతికంగా పతనం చెందిస్తున్న కారణాలను, వాటి నివారణోపాయాలను కష్టించి తెలుసుకొని పనిచేయడం మన ప్రధాన కర్తవ్యం. ఇదే శ్రీరాముడు ఆచరించి చూపినది, శ్రీకృష్ణుడు ఆచరించి చూపినది, అర్జునుడికి బోధించినదీనూ. మెట్టవేదాంతపు మాటలతో మన కర్తవ్యం నుండి తప్పుకొనమని గాదు శ్రీకృష్ణుడు చెప్పినది, రాముడు చెప్పినది.

రాముడు యిలాంటి అపోహలో చిక్కినపుడు వశిష్ఠుడు అతనికి యిలానే బోధించాడని యోగవాశిష్ఠం చెబుతుంది. ఇంతటి మహత్తరమైన గ్రంథాలను భ్రష్టంగా అర్థం చేసుకొని, ముఖ్యమైన వాటి బోధను ప్రక్కను తోసి, మన తలకుమించిన వేదాంత వాక్యాలను మాత్రం వల్లించుకుంటూ యిహపరాల రెండింటికీ చెడిన రేవళ్ళు కావద్దని శ్రీరామనవమి మనకు బోధిస్తున్నది. ఈ సత్యాన్ని గుర్తుంచుకోమని హెచ్చరించడానికే శ్రీరామనవమిని జరుపుకొమ్మని శ్రీసాయిబాబా ప్రత్యేకంగా తన భక్తులకు హెచ్చరించారు. అంతేగాదు వేరొక సందర్భంలో, "నేను చెప్పింది విననివాడితో నాకేమిపని?" అన్నారని గూడ మనం గుర్తుంచుకోవాలి.

# సౌజన్యమూర్తి

శ్రీ ఎమ్. గోపాల కృష్ణమూర్తి

**(విద్యార్థి దశలో మాస్టరుగారి బోధలు అందుకొని ఆ తరువాత నిజజీవితంలో వాటిని అన్వయించుకుంటూ తమ బ్రతుకును తీర్చిదిద్దుకుంటున్న వీరు మాస్టరుగారి మధుర స్మృతులను మనకు అందిస్తున్నారు.)**

నేను 1970 నుండి 1973 వరకు విద్యానగర్‌లోని ఎన్.బి.కె.ఆర్. కాలేజీలో చదివాను. శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు మాకు ఇంగ్లీషుకి వచ్చేవారు. నాది స్పెషల్ ఇంగ్లీషు గనుక మాస్టరుగారితో మాకెక్కువ అనుబంధం వుండేది. మేం గాని సరిగా కాలేజికి అటెండ్ కాకపోతే పిలిచి అడిగేవారు. ఆ రోజులలో ప్రతి సోమవారం మాకు ఎస్సైనుమెంట్ వుండేది. వాటికి తప్పనిసరిగా హాజరు కావాలి. మాకు సినిమా పిచ్చి వుండేది. సినిమా కోసం వాకాడు వెళ్తే మా మేనేజ్-మెంట్ వారు అక్కడుండటం మూలాన వారికి తెలిసిపోతుంది. కాలేజీ పిల్లలు సినిమాలకొస్తున్నారని రిపోర్ట్ వస్తుంది. అందుకోసం గూడూరు వెళ్ళి సినిమా చూసుకొని ఏ ఫ్రెండ్ ఇంట్లోనో ఆ రాత్రికుండి ఆ మరుసటి రోజు కాలేజీకి అటెండ్ అయ్యేవాళ్ళం. సోమవారం ఎస్సైనుమెంట్ కి వెళ్ళకపోతే పెనాల్టీ కట్టాలి. పిలిచి అడిగేవారు. ఇంటికి రిపోర్ట్ వెళ్ళేది. అందుకని సోమవారం తప్పనిసరిగా కాలేజీకి వెళ్ళాలి గనుక వెళ్ళేవాళ్ళం. కానీ ఏం రాయాలి? ఏమన్నా చదివితే కదా పరీక్ష రాయటానికి. అయినా సరే ఏదో ఒకటి రాసేవాళ్ళం. అలా సున్నా మార్కులు వచ్చిన రోజులు కూడా వున్నాయి. అందరి పేపర్స్ యిచ్చి మా పేపర్స్ మాత్రం చేత్తో పట్టుకొని "ఈ పేపర్స్ ఎవరివో వారొచ్చి తీస్కోండి" అనేవారు మాస్టరుగారు. మేం వెళ్ళేవాళ్ళం కాదు. అప్పుడు ఆయన పేర్లు పెట్టి పిలిచి యిచ్చేవారు. అలాయిచ్చి మేం వ్రాసింది చదవమనేవారు. మేం ఏమి పలక్కుండా వుండి పోయేవారం. "మేం అడిగిన ప్రశ్న లేమిటి? మీరు వ్రాసిన సమాధానాలేంటి? ఎందువల్ల మీరు పరీక్ష వ్రాయలేక పోతున్నారు? పాఠాలు అర్థం కావటం లేదా? లేకపోతే అస్సలు చదవలేదా?" అని అడిగేవారు.

మేం బెల్లం కొట్టిన రాయిలా వుండి పోయేవారం. మా బ్లాంక్ ఫేసెస్ చూసి ఆయన గ్రహించేవారు వీళ్ళు చదవలేదని. "ఒరేయ్ తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి అప్పో సొప్పో చేసి మిమ్మల్ని చదువుకోమని పంపిస్తే మీరిలా కాలం వృథం చేసుకుంటారా?" అని కోప్పడేవారు. మమ్మల్ని తన రూమ్ కి రమ్మనేవారు. మిగతా లెక్చెరర్స్ ఎవ్వరూ మా మంచి చెడ్డల గురించి యింతలా పట్టించుకొనేవారు కాదు. వారి పాటికి వారు పాఠాలు చెప్పుకుని వెళ్ళిపోయేవారు. మరి ఈయన అలా కాదే. "ఎందుకీయనకు ఇంత తపన మా గురించి!" అని అనుకునే వాళ్ళం. లెక్చెరర్ పిల్చారు గనుక వెళ్ళక తప్పదు.

మొదట్లో కొంచెం విసుగనిపించేది. అయినా వెళ్ళేవాళ్ళం. అప్పుడాయన బ్రహ్మచారి. ఆయన రూమ్ లో రాక్స్ (racks) వుండేవి. వాటిల్లోంచి బుక్స్ తీసికెళ్ళి చదవమని చెప్పేవారు. పోనీ మొహమాటం

కొద్ది ఏవో బుక్స్ తీసికెళ్ళి మళ్ళీ కామ్ గా తిరిగిచ్చేద్దామంటే వుహూ అలా కుదరదే ఏం చదివారో చెప్పమనేవారు. "ఇదెక్కడి గొడవరా బాబు" అని అనుకునే వాళ్ళం. అందుకని సన్నటి పుస్తకాలు వెతుక్కుని పట్టుకెళ్ళి చదివే వాళ్ళం. ఆయన దగ్గర బైబిల్, ఖురాన్, దగ్గర్నుంచి అన్ని మతాలకు సంబంధించిన పుస్తకాలుండేవి. "ఇవేంటి సార్ ఇవన్నీ వున్నాయి" అని అంటే "అన్నీ చదవాల్రా" అనేవారు. ఆయనకు కులమత బేధం లేదు. ఆయన రూమ్ కెళ్తే బాబా గురించి, మహాత్ముల గురించి చెప్పేవారు. ఆయన సన్నిధిలో ఎంతో హాయిగా, మనసంతా ఎంతో ప్రశాంతంగా వుండేది. అప్పట్లో ఆయన రచనా వ్యాసంగం చేపట్టారు. ఎప్పుడూ ఆయన చుట్టూ కొంతమంది స్టూడెంట్స్ వుండేవారు. ఆయన డిక్టేట్ చేస్తుంటే నా క్లాస్ మేట్ శరత్ బాబు, దామోదర్ అనే ఇంకొక కుర్రవాడు వ్రాస్తూండేవారు. మొదట్లో ఆయన మమ్మల్ని పట్టించుకోటం రూమ్ కి రమ్మనటం మాకెంతో విసుగ్గా వుండేది. అందుకని ఆయనని, ఆ రూమ్ ని తప్పించుకొని తిరిగేవాళ్ళం. కాని వారి దగ్గర కెళ్ళటం మొదలెట్టాక అదేం మహత్యమో రాను రాను ఆయన మీద గౌరవం ఏర్పడి ఆయన్ను తప్పించుకు తిరుగుదాం అని అనుకున్న వాళ్ళం కాస్తా తప్పనిసరిగా వెళ్ళాలన్పించి రూమ్ లో వున్నారో లేరోనని చూసి మరీ వెళ్ళేవాళ్ళం ఎంతో యిష్టంగా! కష్టాల్ని కూడా యిష్టంగా మార్చే శక్తి ఆయనకున్నది. అలా కాలం గడిచేకొద్దీ కేవలం విద్యార్థులే గాక, వారి తల్లిదండ్రులు, స్థానికులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా ఎంతో మంది వచ్చేవారు. చివరకు రోజూ వెళ్ళే మాక్కూడా స్థలం చిక్కక ఎక్కడో దూరంగా కూర్చునేవాళ్ళం.

విద్యానగర్ లో మేం చదువుకునేటప్పుడు హిల్ వ్యూ అనే హోటలుండేది. అక్కడకు మేము అప్పుడప్పుడు వెళ్తూండేవారం. ఎప్పుడన్నా మాస్టరుగారు కూడా వచ్చేవారు. ఆయన వస్తే మాత్రం మా బిల్ కూడా ఆయనే చెల్లించేవారు. అలానే ఆయన సిగరెట్స్ కొనడానికో లేదా ఇంకేమన్నా పనిమీదనో సెంటర్ కి వస్తే మేమెవరన్నా కన్పిస్తే సోడాలు మొదలైనవి యిప్పించేవారు. ఆయన పిల్లల్లో ఒక ఫ్రెండ్ లాగా కలసి పోయేవారు. ఎంతో నిస్వార్థంగా మా మంచిచెడ్డలు కష్టసుఖాలు పట్టించుకునేవారు. అలా పిల్లల్లో వారికి సాన్నిహిత్యం పెరిగేది. మా హాస్టల్ భోజనం అంత బాగుండేది కాదు. మేం పిల్లలం హాస్టల్ వారితో గొడవ పెట్టుకుంటే రూమ్ దగ్గరే గనుక ఆయనకు తెల్సిపోయేది. వెంటనే వచ్చేవారు. "ఒరేయ్ ఇలా గొడవ చెయ్యకూడదు సర్దుకొని పోతూండటం నేర్చుకోవాలి" అని ఎంతో అనునయంగా మమ్మల్ని కూల్ చేసేవారు. ఎవరం కూడా ఆయన మాట ఎగర్తించి పొయ్యేవాళ్ళం కాదు. అంత గౌరవం ఆయనంటే.

ఆయన అతి సామాన్యమైన జీవితాన్ని గడిపేవారు. ఒక్కోసారి కాళ్ళకి చెప్పులు కూడా వేసుకోకుండా వచ్చేవారు. బట్టలు కూడా చాలా సింపుల్ గా వేసుకొనేవారు. కానీ చాలా నీట్ గా వుండేవారు. మేనేజ్-మెంట్ కి చెందిన వారబ్బాయి మా కాలేజి స్టూడెంట్ ఒకతను వుండేవాడు. వారిది చాలా కలిగిన కుటుంబం. మాస్టరుగారి వల్ల ప్రభావితుడై అతి సామాన్యమైన జీవితం గడిపేవాడు. కాళ్ళకి చెప్పులు లేకుండా అతి సాధారణమైన దుస్తులు ధరించి కారు వద్దకి నడుచుకుంటూ వెళ్ళేవాడు. ఇది సహజంగా ఆ పిల్లవాని తల్లిదండ్రుల కెంతో మనస్తాపాన్ని కల్గించింది. మాస్టరుగారికి పరోక్షంగా చెప్పి చూశారు. "ఆ పంతులు తన పాటికి తను పిల్లలకి పాఠాలు చెప్పుకుపోవాలి గాని ఇలా పిల్లలకు ఆధ్యాత్మికతను బోధించడ మేమిటి?" అని అనుకునేవారు. అంతేగాక ఒక తాగుబోతు వచ్చి ఈ విషయంపై బాగా గొడవ చేశాడు. వల్గర్ లాంగ్వేజిలో మాట్లాడాడు. కానీ మాస్టరుగారు అలాంటి వారితో కూడా ఎంతో సౌమ్యంగా, సర్దుబాటు విధానంలో మాట్లాడేవారు. ఏ మాత్రం కోప్పడలేదు. అంతటి సౌజన్యమూర్తి ఆయన.

క్లాస్ లో కూడా ఎప్పుడూ సీరియస్ గా వుండేవారు కాదు. సింపుల్ లాంగ్వేజ్ లో పాఠాలు అందరికీ బోధపడే రీతిన చెప్పేవారు. అర్థం కాకపోవటమన్న ప్రశ్నే లేదు. చాలా హుషారుగా సరదాగా వుండేవారు.

ఆయన రూమ్ కెళ్లినప్పుడల్లా మాకు మంచి మాటలు చెప్తూండేవారు. సామాన్యంగా ఆయన దగ్గర కొచ్చేవారిలో ఎక్కువమంది మధ్య తరగతి కుటుంబీకులే. "పెద్దవారిని ఏ విధంగా గౌరవించాలి. పెళ్ళైన తర్వాత భార్యకే ప్రాముఖ్యత నిచ్చి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదు. వీలైనంత వరకు ఏ విషయాన్నైనా పెద్దవాళ్ళతో మాట్లాడి వారితో

సలహా సంప్రదింపులు జరపాలి. వీలు కానప్పుడు విషయం వివరంగా చెప్పి వారిని ఒప్పించటానికి ప్రయత్నించాలి. కష్టసుఖాలను వారితో పంచుకోవాలి" అని చెప్పేవారు. వారిలా చెప్పటం వలన ముందు జీవితంలో నాకు ఎంతగానో మేలు జరిగింది. పిల్లల్ని ఎలా పెంచాలి అనే విషయాన్ని గురించి చెప్తుంటే నేనుండి, "ఎందుకు సార్ మీరు బ్రహ్మచారే, మేమూ బ్రహ్మచారులమే, మనకెందుకు సార్ ఆ గొడవలు" అంటే నవ్వి, "కాదురా తెల్సుకొని వుండాలి" అని అన్నారు. సందర్భానుసారంగా వారు చెప్పిన విషయాలు ముందు జీవితంలో మా కెంతగానో వుపయోగపడ్డాయి.

"సార్, పెళ్ళి చేస్కోండి సార్" అని అంటే, 'ఇంకా టైమ్ రాలేదులే' అనేవారు. పెళ్ళైన తర్వాత నాకొక కార్డ్ వ్రాశారు. "ఒరేయ్ అనుకోకుండా పెళ్ళి జరిగింది పిలవలేకపోయాను" అని. పోనీలే ఇప్పటికైనా చేసుకున్నారు అని ఎంతో సంతోషించాను.

ఎప్పుడు లెటర్ వ్రాసినా దానికి వెంటనే రిప్లై యిచ్చేవారు. ఆ విషయంలో చాలా ఆశ్చర్యంగా వుండేది. మనం మన వాళ్ళకే లెటర్ వ్రాయాలంటే బద్ధకిస్తాం కానీ ఆయన మాత్రం అంత తీరికలేని కార్యక్రమాల్లో వున్నా వెంటనే సమాధానం ఇచ్చేవారు.

అలా అయిష్టంగా విసుగ్గా మొదలైన మా బంధం ఇప్పుడు ఎంతగానో యిష్టమైన అనుబంధంగా మారింది. ఇప్పుడు ఆయన వాక్కు మాకు వేదవాక్కు. క్లిష్ట పరిస్థితులలో ఎప్పుడు తలచుకుంటే అప్పుడు ఆపద్బాంధవునిలా మమ్మల్ని ఆదుకుంటారు. అలాంటి సన్నివేశాలు రెండు, మూడు చెప్తాను.

ఒకసారి ఎం. ఎ. సోషియాలజి పరీక్షకై తిరుపతి కెళ్ళి కాలేజీ హాస్టల్ లో వున్నాను. ఆ రోజంతా మండుటెండలో తిరగటం వల్ల వడదెబ్బ తగిలింది. విపరీతమైన తలనొప్పి, తెల్లవారితే పరీక్ష వ్రాయాలి. మోనోగ్రాఫ్ పరీక్ష దానికి సంబంధించిన మెటీరియల్ ఎంత ప్రయత్నించినా దొరకలేదు. అదొక టెన్షన్, భరించలేని తలనొప్పి. ఇంతలో దగ్గర్లో మాస్టారి కంఠ ధ్వని విన్పించింది. "అరె ఏమిటి? ఈయన యిక్కడికెందుకొచ్చారు?" అని అనుకున్నాను. ఇంతలో ఎవరో చూసొచ్చి "ఆ.. మాస్టర్ గారే వచ్చారు. ఫలానా రూమ్ లో వున్నారు" అని చెప్పారు. అప్పుడు నేను వెళ్ళి చెప్పాను. "సార్ ఇది పరిస్థితి" అని వెంటనే ఆయన ఏవో హోమియో పిల్స్ యిచ్చి "రాపోదాం" అని టీకి తీస్కెళ్ళారు. అలా వెళ్తుంటే మా ముందు ఎవరో యిద్దరు కుర్రవాళ్ళు "ఫలానా చోట మోనోగ్రాఫ్ మెటీరియల్స్ దొరుకుతున్నది. 150 రూపాయలు ఇస్తే" అని చెప్పుకుంటూ పోతున్నారు. వుండండి సార్, యిప్పుడే వస్తానని మాస్టార్ గారికి చెప్పి వెళ్ళి వాళ్ళను ఆపి డీటైల్స్ అడిగాను. వెళ్ళి మెటీరియల్ తెచ్చుకున్నాం. ఆ తలనొప్పి ఎక్కడికి పోయిందో! ఆ రాత్రి కూర్చుని చదివినందుకు 50 మార్కులతో పాసయ్యాను. తర్వాత ఆలోచిస్తే నాకెంతో ఆశ్చర్యం వేసింది. మాస్టరుగారు కరెక్ట్ గా ఆ టైమ్ కే రావటం, నా తలనొప్పి తగ్గటానికి ఆయన టీకి పిల్చుకుపోవటం, మధ్యలో ఎవరి ద్వారానో నోట్స్ దొరకటం తల్చుకుంటే యిదంతా మాస్టరుగారి కృపే అనిపిస్తుంది. లేకపోతే హాయిగా కూర్చుని మాట్లాడుతున్న వారల్లా మూడు కిలోమీటర్ల దూరంలో వున్న టీ బంక్ కి తీసికెళ్ళటం ఆయన కరుణగాక మరేమిటి? ఆయన రాకపోతే ఆ పేపర్ దొరికే ప్రసక్తే లేదు. ఆ తర్వాత కనుక్కుంటే మాస్టర్‌గారు లేరు. ఏవో పేపర్లు దిద్దటానికొచ్చారు. దిద్దటం అయిపోయింది. ఆయనెళ్ళిపోయారు.

ఇంకోసారి మోటార్ సైకిల్ యాక్సిడెంట్ జరిగింది. కాని నాక్కొంచెం కూడా హాని జరగలేదు. నా బండిని చూసిన వాళ్ళెవరూ నమ్మలేరు. ఎందుకంటే అంత ఘోరంగా బండి పాడయిపోయింది. ఇది కూడా మాస్టర్ గారి, బాబా గారి చలవే.

ఒకసారి మాస్టరుగారికి లెటర్ వ్రాసాను "మీరు షిరిడి కెళ్ళేటప్పుడు తెలియపరిస్తే నేనూ మీతో వస్తాను సార్" అని వెంటనే జవాబిచ్చారు. "నా ట్రిప్ కాన్సిలయ్యింది" అని. ఇంకో స్నేహితుడు గొడవ చేస్తే సరేనని బయల్దేరాము. వూరుగాని వూరెళ్ళుతున్నాం. భాష తెలీదు. తెలిసిన వాళ్ళెవరూ లేరు. షిరిడీ చేరిన తర్వాత రూమ్ తీసుకుని అక్కడికెళ్తే ఆ రూము దగ్గరగా మాస్టరుగారు నిల్చుని వున్నారు. ఏం సార్ మాకేమో రానని చెప్తిరి, మళ్ళీ వస్తిరి" అంటే, "మొదట్లో అలానే అనుకున్నాను, కానీ రావాల్సి వచ్చి వచ్చాను" అన్నారు. షిరిడీలో చూడాల్సిన ప్రదేశాలన్నింటిని మాకు స్వయంగా చూపించారు. ఆ ట్రిప్ మాకెంతో తృప్తి, ఆనందాన్నిచ్చింది. మరి అంతేకదా! నాకిష్టమైన మాస్టర్

గారు దగ్గరుండి అన్నీ చెప్తూ చూపిస్తే ఆనందం కాక మరేంటి?

ఆయన దగ్గర కెళ్ళినప్పుడల్లా "ఒరేయ్ పెళ్ళి చేస్కోరా" అనేవారు. "అలాగే సార్" అనే వాడిని. తర్వాత పెళ్ళి చేసుకున్నాను. నా భార్యది నా కులం కాదు, నా మతం కాదు. ఆవిడ క్రిస్టియన్, స్టాఫ్ నర్స్. మొదట్లో మా పెళ్ళికి మా వాళ్ళెవరూ యిష్టపడలేదు. కానీ మావాళ్ళని కూచోబెట్టి వున్న విషయాలు చెప్పి వారిని ఒప్పించగలిగానంటే మాస్టర్ గారి బోధల వల్లనే.


మా పెద్దమ్మాయి పుట్టిన పదవ రోజున యూరిన్ ఇన్ ఫెక్షన్ వచ్చింది. డాక్టర్స్ యిక్కడ లాభం లేదు. ఆపరేషన్ చేయాలి లేకపోతే బ్రతకదు. మెడ్రాస్ తీస్కెళ్ళమన్నారు. అక్కడ వారు "పెద్దాపరేషన్ చేయాలి. స్పెషలిస్ట్ యిక్కడ లేరు, ప్రస్తుతం ఆయన బాంబేలో వున్నారు" అన్నారు. ఇకచేసేదేమీ లేక సరే ఈ లోపల షిరిడీ వెళ్తామని బయల్దేరాము. బయల్దేరినప్పట్నించీ హైటెంపరేచర్, వాంతులు. "ఇలాంటి పిల్లను తీసుకెళ్తున్నాం. మళ్ళీ పిల్లతో తిరిగి వస్తామా! " అన్నది అనుమానంగానే వున్నది. అయినా సరే మాస్టర్ గారి మీద, బాబా మీదా భారం వేశాం. షిరిడీలో రెండ్రోజులున్నాము. బాబాకు అభిషేకం చేసిన తీర్థాన్ని పాపకు యివ్వటం, ఒళ్ళు తుడవటం, సమాధి మీద పడుకోబెట్టడం. ఇలా నాలుగు పూటలు చేశాం. షిరిడీ చేరిన వెంటనే పాప జ్వరం, వాంతులు తగ్గిపోయాయి. తర్వాత ఏ బాధ లేకపోతే హాస్పిటల్ కి తీసుకెళ్ళలేదు. కానీ చుట్టుప్రక్కల వారు, స్నేహితులు మేం అలక్ష్యం చేస్తున్నాము అని అంటుంటే సరే ఎందుకైనా మంచిదని పాపను చూసిన స్పెషలిస్ట్ దగ్గరకు తీసికెళ్ళాం. మళ్ళీ అన్ని పరీక్షలు చేశారు. చేసిన తర్వాత ఆ డాక్టరు అడిగిన మొదటి ప్రశ్న "మేమింతకుముందు చూసింది ఈ పాపనేనా?", "ఔనన్నాం". "ఏమిటి? ఎక్కడికి పోయారు?" అని అడిగితే, జరిగింది చెప్పాం. "గాడ్ ఈజ్ గ్రేట్. ఇంత దుస్థితిలో వున్న ఈ పాప ఏ మందులు లేకుండా ఎలా బాగుపడిందో మా కర్థం కావటంలేదు" అని ఆశ్చర్యపోయారు. ఆ రోజునుంచీ, ఈ రోజు వరకూ ఆ పాపకెలాంటి బాధాలేదు. అది కేవలం బాబా, మాస్టర్ గారు చేసిన అద్భుతం. ఆ రిపోర్టులు యిప్పటికీ నాదగ్గరున్నాయి.

మాస్టరుగారు మాతో చాలా స్నేహపూర్వకంగా వుండేవారు. ఒకసారి మాస్టరుగార్ని అడిగాను. "మాస్టర్ గారు, మీరేమో ఎప్పుడూ సిగరెట్స్ తాగుతుంటారు. మాకేమో అది పడదు. మేమంటే సరే. అందరూ దాన్ని అంగీకరించరు కదా. మిమ్మల్ని విమర్శిస్తుంటే మాకు చాలా బాధగా వుంటుంది" అని అంటే, "ఏదోలేరా ఒక్కోళ్ళకి ఒక్కో అలవాటుంటుంది " అని దాటేశారు.

ఆయన వాక్కు మాకు వేదవాక్కు. ఆయన మాకు విద్యార్థి దశలో చెప్పిన విషయాలు, చేసిన బోధలు మా జీవితాలలో మాకెంతగానో వుపయోగపడ్డాయి. ఆయన మాకొక పెద్దదిక్కు, ఒక స్నేహితుడు, గురువు, దైవం. మాకే సమస్య వచ్చినా బాబాకి, మాస్టరుగారికి చెప్పుకుంటాం. మాకు వారు అండగావుండి మా సమస్యల్ని పరిష్కరిస్తున్నారు. మా పిల్లలకి వీరిద్దర్నీ చూపిస్తూ "వీరు నాకు మా నాన్న గారికంటే కూడా ఎక్కువ " అని చెప్తాము.

ఆయన ఇంకో మూడు రోజులలో సమాధి అవుతారనగా కలలో కన్పించి, "నా ఫొటోకి పూజచేస్కోరా" అని చెప్పారు. బ్రతికున్న వారి ఫొటోకి పూజ ఎందుకు చేస్తారు? అని అనుకున్నాను. అదే మాట నా భార్యతో కూడా అన్నాను. తర్వాత మూడవ రోజు సాయంత్రం వార్తలలో మాస్టరుగారు సమాధి అయినట్టు విని నిశ్చేష్టుడిని అయ్యాను. వెంటనే బయల్దేరి మాస్టర్ గారిని ఆఖరిసారిగా దర్శించుకొని వచ్చాను. ఇంకా ఒక 10, 15 ఏళ్ళు గాని మాస్టరుగారు వుండి వుంటే ఎంత బాగుండేది, ఎంతమందికి బాబా గురించి తెలియ చెప్పేవారో గదానని అన్పించింది.

ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్ గా నా జీవితంలో ప్రవేశించి ఒక స్నేహితునిగా, శ్రేయోభిలాషిగా నన్ను ఆదరించి చివరకు నా జీవితానికి మార్గదర్శకులై సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ నా హృదయంలో దైవంగా నిల్చిపోయారు మాస్టరుగారు.



# నానాసాహెబ్ చందోర్కర్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీసాయిని సేవించినవారిలో మొదటగా మనకు గుర్తొచ్చేవారు తన హరికథలద్వారా మహారాష్ట్ర దేశమంతటా వారి దివ్యలీలలను ప్రకటం చేసిన దాసగణు మహరాజ్; 'శ్రీసాయి సచ్చరిత్ర' వ్రాసి మొదటి పారాయణ గ్రంథంగా మహారాష్ట్రానికందించినఅన్నాసాహెబ్ దభోల్కర్ ఉరఫ్ 'హేమాడ్పంతు', అమిత నిరాడంబరంగా వుండిన శ్రీ సాయిసన్నిధిని మహా వైభవోపేతమైన సంస్థానంగా రూపొందించిన రాధాకృష్ణమాయి. వీరు శ్రీసాయి మహిమ, వైభవమూ – ఈ రెండింటినీ ప్రపంచమెదుట చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేసారు. కానీ వీటన్నింటి వెనుక యివేమీ చేయనట్లు కన్పించే అదృశ్య హస్తంవంటి వాడు నానాసాహెబ్ చందోర్కర్. దాదాపు ఆరు దశాబ్దాలు బాబా నివసించిన మశీదును మరమ్మత్తు చేయించి దానికి ప్రస్తుతరూపమిచ్చిన ధన్యతగూడ ఈతనిదే. అతడు ఉన్నత ప్రభుత్వోద్యోగానికి తోడు మంచి వాక్పటిమ గలవాడు. హృదయం నిండుగా సాయిపట్ల భక్తి వున్నది. ఇక కొరవేమి? ఇతడు తనకు తారసిల్లిన బంధువులకు, స్నేహితులకు, ఆర్తులకేగాక ఉద్యోగరీత్యా తనకు పరిచయమున్న వారందరికీ గూడ – ఎలాగైనా సందర్భం కల్పించుకొని – సాయి మహిమగురించి హృదయాలకు హత్తుకుపోయేలా చెబుతుండేవాడు. తర్వాత వారు కన్పించినపుడల్లా శ్రీ సాయిని దర్శించుకొమ్మని ప్రోత్సహిస్తుండేవాడు. ఇతడు చెప్పడం వలన ప్రభావితులై సాయిని దర్శించుకొని ధన్యులైన వారెందరో! అట్టివారిలో హరిసీతారామ్ (కాకా) దీక్షిత్, అన్నాసాహెబ్ దభోల్కర్, బి.వి.దేవ్, తాత్యాసాహెబ్ నూల్కర్, దాసగణు (ఉరఫ్ గణపతిరావ్ సహస్ర బుద్ధే), రాధాకృష్ణ మాయి మొ॥న వారు ముఖ్యులు. అంటే అటు హరికథలద్వారా సాయి కీర్తిని విస్తరింపచేసిన దాసగణు, 'శ్రీసాయి సచ్చరిత్ర' రచన ద్వారా శ్రీసాయిచరిత్ర పారాయణా సంప్రదాయమారంభించిన హేమాడ్పంతు శ్రీసాయి సన్నిధి చేరడానికి దోహదం చేసినదిగూడ నానాసాహెబ్ చందోర్కరేనన్నమాట. వారు సాయి భక్తులకు అంతటి మహత్తరమైన సేవ చేయడంలోగూడ యితడి పాత్రయే ఎంతో ముఖ్యమైనది. కానీ యితడు సాయి సన్నిధి ఎలా చేరాడు? నిజానికి తమ భక్తులను సాయియే తమచెంత చేర్చుకోవాలి. అది యింకెవరివల్ల అవుతుంది?

ఈనాడు మనం అనేక ప్రాంతాలలో తరచుగా చేసుకుంటున్న సత్సంగం నిజానికి యీనాడు మనం రూపొందించుకున్నది గాదు. వెనుకటి యుగాలలో ఋషులందరూ నైమిశారణ్యంలో ఒకచోట చేరి భగవంతుని లీలలు చెప్పుకొని, ఆనందిస్తుండేవారు. అదిగూడ వారి తపస్సులో భాగమే. అలానే బొంబాయినుండి వచ్చే యీ ప్రముఖ సాయిభక్తులు ఒక సంఘంగా ఏర్పడి, పాత హనుమాన్ వీధిలోని మోరేశ్వర్ ప్రధాన్ యింట తరచుగా సమావేశమై సత్సంగం చేస్తుండేవారు. అంటే సాయి లీలలు, బోధలు ఒకరికొకరు వివరించుకొని, ఆరతులు జరుపుకొనేవారు. ఈ సంఘంవారు క్రొత్తగా శిరిడీ దర్శించే భక్తుల శ్రేయస్సు కోరి కొన్ని సూచనలు చేశారు. అట్టి భక్తులు శిరిడీచేరి మొదట గురుస్థానం దర్శించి, అక్కడ ప్రదక్షిణం చేసి, తర్వాత మశీదు దర్శించడం సరియైన

పద్ధతియని సూచన వ్రాసారు. బాబా మహాసమాధి చెందాక, భక్తులు గురుస్థానము, మశీదు, చివరకు సమాధి మందిరమూ యీక్రమంలో దర్శించడం సరియైన పద్ధతియని వ్రాశారు.

అహ్మద్ నగర్ నుండి కోపర్గావ్ కు మమల్తదారుగా చిదంబర్ గాడ్గిల్ బదిలీ అయ్యాడు. అతని కార్యదర్శిగా నానాసాహెబ్ చందోర్కర్ పనిచేస్తున్నాడు. ఆ కాలంలోనే ఒకరోజు శిరిడీ గ్రామ కరణమైన 'కేశవ్ అనంత్' ఉరఫ్ 'అప్పా కులకర్ణి' కోపర్గాంలో జరుగనున్న జమాబందీకి బయల్దేరబోతూ బాబాను సెలవు కోరాడు. అపుడాయన సెలవిచ్చి, అక్కడ ఉన్నత ప్రభుత్వోద్యోగియైన నానా సాహెబ్ చందోర్కర్ ను తాము రమ్మన్నామని చెప్పమన్నారు. ఆ మాట విని కులకర్ణి కంగారుపడ్డాడు. అంత పెద్ద ఉద్యోగిని తనవంటి అతి సామాన్యుడు ఆహ్వానించడమేమిటి? అందులోగూడ కేవలం పేదభిక్షువైన సాయి ఫకీరు పిలిచారని అతనితో చెప్పడమెలా? తనకు సాయిపట్ల ఎంత భక్తిశ్రద్ధలున్నా ఉన్నతోద్యోగి, శ్రీమంతుడు అయిన నానాకు సాయిపట్ల భక్తిభావమేముంటుంది? అయినప్పటికీ బాబా మాట త్రోసివేయలేక అతడు కోపర్గాంకు వెళ్ళి ఆ కబురు చెప్పాడు. కాని నానా రాలేదు. అలానే రెండవసారి, మూడవసారీగూడ కబురు చేసినా అతడు రాలేదు. బాబా తమ పట్టు విడవక అతనికి మళ్ళీ మళ్ళీ కబురు పెడుతున్నారు.

చివరిసారి అప్పా కులకర్ణి ఆ మాట చెప్పినపుడుగూడ నానా చందోర్కర్, "మాటిమాటికి అనవసరంగా సాయిబాబా పేరు ఎత్తుతావెందుకు? నీకు నావలన కావలసిన పనేదైనా వుంటే నిర్భయంగా చెప్పవచ్చుగదా?" అని విసుక్కున్నాడు. కాని నిజంగా బాబా అతనిని పిలిచారని చెప్పాక శిరిడీకి బయల్దేరాడు. కాని తన మనసులో మాత్రం తాను కులకర్ణి చెప్పిన కబురువిని ఒక పేద బిచ్చగాని దర్శనానికి వెళుతున్నాననుకున్నాడు. అయినా, 'కొందరు ఆయనను మహాత్ముడంటారు గనుక ఆయనకు సమర్పించడానికి నేనేమీ తీసుకెళ్ళడం లేదే?' అనుకున్నాడు. శిరిడీ సమీపిస్తుండగా యిలా ఆలోచిస్తూ, కాకతాళీయంగా తన కోటు జేబులో చేయి పెట్టుకునేసరికి, అతని చేతికొక చిన్న పొట్లం తగిలింది. విప్పి చూస్తే అందులో నాలుగు సీమబాదం పప్పులు, నాలుగు కలకండ ముక్కలూ వున్నాయి. అతడు ఉత్సాహంగా బాబాను దర్శించి, సాష్టాంగ నమస్కారంచేసి, ఆ పొట్లాన్ని ఆయన ముందుంచాడు. అపుడు వారి ఎదుట కూర్చుని, తనకు కబురు చేసిన కారణమేమని అడిగాడు నానా. "నిన్ను పిలిపించడానికి వేరే కారణమేమీ లేదు. మన సంబంధం కొన్ని జన్మలది. ఆ సంగతి నాకు తెలుసు. నీకు తెలియదు. వీలున్నపుడల్లా వచ్చి పోతూండు!" అన్నారు బాబా. నానా ఆమాట అంతగా నమ్మలేకపోయాడు. బాబా ఆ పొట్లమతనికి యిచ్చేసి అతనిని వెళ్ళిరమ్మన్నారుగాని, అతడు పట్టుబట్టిన మీదట ఒక్క బాదం పప్పు, ఒక్క కలకండ ముక్క మాత్రం తీసుకుని మిగిలినవతనికి యిచ్చి పంపేశారు.

నానాసాహెబ్ చందోర్కర్ అసలు పేరు నారాయణ గోవింద్ చందోర్కర్. ఇతడు ఒక ఉన్నత హిందూ కుటుంబంలో జన్మించాడు. అతని తల్లిదండ్రులు యిటు శిష్టాచారానికి, శాస్త్ర పాండిత్యానికి, మరొకవంక ఉన్నత ప్రభుత్వోద్యోగానికి పేరుమోసినవారు. శాస్త్రాలు చక్కగా అధ్యయనంచేసి వైశ్యదేవము, అతిథిసేవ శ్రద్ధతో చేసేవారు. కల్యాణ్ పట్టణంలోని వారియిల్లు ఎప్పుడూ అతిథులతో కళకళలాడుతుండేది. అతని తండ్రి ఠాణేలో ఉన్నత ప్రభుత్వోద్యోగి (డిప్యూటీ కలెక్టర్)గా రిటైరయి కల్యాణ్ లో 'చందోర్కర్ వాడా'గా ప్రఖ్యాతి పొందిన పెద్దభవనం కట్టుకున్నాడు. అతడు అంగోన్ కవాడ్ (భివండి తాలూకా)లోని శ్రీ సఖారామ్ మహరాజ్ అను మహనీయునివద్ద ఉపదేశ దీక్ష తీసుకున్నాడు. నానాసాహెబ్ గూడ తన తండ్రివలెనే శాస్త్రాలు, శంకరాచార్య బాష్యంతోసహా భగవద్గీత చక్కగా చదువుకున్నాడు. అందుకే అటు తర్వాత బి.వి.దేవ్ వంటి సాయిభక్తులు అతనిని గురువుగా తలచేవారు.

నారాయణ్ గోవింద్ చందోర్కర్ 1860లో మకర సంక్రాంతినాడు జన్మించాడు. అతడు కళ్యాణ్ మరియు బొంబాయిలలో చదువుకుని బి.ఎ. పాసైనాడు. అతనికి సంస్కృతమంటే ఎంతో ప్రీతి. తన చదువు పూర్తికాగానే సంగమనేర్ లోని మమల్తదార్ కోర్టులో కొంతకాలము, తర్వాత కోపర్గాంలోనూ పనిచేశాడు. 1892 లో జిల్లా కలెక్టరుకు కార్యదర్శి అయ్యాడు. తర్వాత క్రమంగా ఉద్యోగంలో పైస్థాయికి వచ్చి 1894 నుండి 1901 వరకూ అహ్మద్ నగర్ జిల్లా కలెక్టర్

కు కార్యదర్శిగా పనిచేశాడు. అప్పటికే అనగా 1878లో, నానాసాహెబ్ 'ఒర్ఘూ' అను గొప్ప జమీందారుగారి కుమార్తె బయాజీబాయిని వివాహమాడాడు. ఇతడు కోపర్గాంలో పనిచేస్తుండగా అతని పసిబిడ్డ ప్రమాదంగా జబ్బుపడి చనిపోయాడు. కారణం ఆవూరిలో ఎటువంటి వైద్యవసతి వుండేదిగాదు. అపుడచటి ప్రజల బాధ గుర్తించి అతడు తన స్వంత ఖర్చుతో ఒక ఆసుపత్రి కట్టించి, 18 సం॥లు నిర్వహించాక ప్రభుత్వానికి అప్పగించాడు.

ఆ కాలంలో మహారాష్ట్ర దేశమంతటా తరచుగా తీవ్రమైన ప్లేగువ్యాధి చెలరేగి ఎందరో మరణిస్తుండేవారు. అందువలన ప్రజలను దానినుండి రక్షించడానికి ఆంగ్ల ప్రభుత్వం ఒక విధమైన టీకాలు వంటివి ప్రజలకు చేయాలని నిర్ణయించుకున్నారు. క్రొత్తగా వచ్చిన ఆ పద్ధతి చూచి, ప్రజలు భయపడి ఆ టీకాలు వేయించుకునేవారుగాదు. ఆయా ప్రాంతాలలోని ప్రజలకు ధైర్యం కలగడానికి, వారికి ఆదర్శప్రాయంగాను, మొదట ప్రభుత్వోద్యోగులందరూ విధిగా చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ అతనిని కోరారు. అధికారుల వత్తిడికి తలవొగ్గి ఆ టీకాలు వేయించుకొంటే ఏమి ప్రమాదం వాటిల్లుతుందోనని భయపడి ఆ విషయం నిర్ణయించుకోడానికి ఒక వారం వ్యవధి కోరి బాబా వద్దకు పరిగెత్తాడు చందోర్కర్. బాబా, "ఆ, అందులో ఏముంది? చేయించుకో! నీకెట్టి ప్రమాదమూ జరగదు" అన్నారు. అతడు వెంటనే అహ్మద్ నగర్ చేరి టీకాలు వేయించుకున్నాడు. తర్వాత మిగిలిన ఉద్యోగులందరూ వేయించుకున్నారు. ఎవరికీ ఎట్టి యిబ్బంది కలుగలేదు. అతనికి తెలియకనే బాబా అతని హృదయాన్ని తమ అధీనం చేసుకున్నారు. అతడు తరచుగా శిరిడీ రానారంభించాడు.

ఒకపుడు నానా చందోర్కర్ తో పాటు ఒక కీర్తనకారుడుగూడ శిరిడీకి వచ్చాడు. వారిద్దరూ ఆ మరురోజే అహ్మద్ నగర్ చేరవలసి వున్నది. రైలుకు టైమవుతుందని చెప్పి, బయలుదేరడానికి వారిద్దరూ బాబాను సెలవు కోరారు. బాబా, "ఏమీ తొందరలేదు! మీరిద్దరూ స్థిమితంగా భోంచేసి బయలుదేరండి" అన్నారు. బాబా మాటలయందు పూర్తి విశ్వాసంగల నానాసాహెబ్ రైలుకు ఆలస్యమవుతుందని భయపడక, నెమ్మదిగా భోజనంచేసి బయలుదేరాడు. హరిదాసు మాత్రం మరురోజు కార్యక్రమానికి అందుకోలేకపోతే తనకు రావలసిన పారితోషికం చేయిజారిపోతుందని భయపడి టైము ప్రకారం కోపర్గాం చేరదలచి భోజనం చేయకుండానే బయలుదేరాడు. కాని ఆరోజు ఆ రైలు కొన్ని గంటలు ఆలస్యంగా వచ్చింది. ఎంతో తాపీగా భోజనం చేసి బయలుదేరిన నానాగూడ కోపర్గాం చేరేసరికి హరిదాసు ఆకలితో బాధపడుతూ వేచివున్నాడు. నానా చేరిన కొద్దిసేపటికిగాని రైలు రాలేదు. శ్రీసాయికి అన్నీ తెలుసునని ఆ హరిదాసు గుర్తించాడు. అంతేగాదు, నానాకు ఆ ముందటిరోజు బాబా చెప్పిన ఒకమాట గుర్తుకొచ్చింది. వారిద్దరూ శిరిడీ చేరగానే ఆయన అన్నారు — "ఈ హరిదాసు చూడవయ్యా! అతడు నీతో కలసి వచ్చాడు గాని తనకు అనుకూలమని తోచినపుడు నిన్ను విడిచిపెట్టి ఒక్కడే వెళ్లిపోతాడు. ఎప్పుడూ నిన్నలా మధ్యలో విడిచి పెట్టిపోని స్నేహితులనే చేర్చుకోవాలి".

ఒకరోజు ఉదయమే నానా కోపర్గాంకు తప్పక వెళ్ళవలసి వున్నది. జిల్లా కలెక్టరు అక్కడికి వస్తూ తననక్కడ కలుసుకొమ్మని నానాను ఆదేశించాడు. అందువలన నానా బయల్దేరి బాబాను సెలవు కోరాడు. ఆయన, "ఇవాళ నీవేమీ వెళ్ళనక్కరలేదు, రేపు వెళ్ళవచ్చులే!" అన్నారు. జిల్లా కలెక్టరు ఆదేశాన్ని పాటించాలా, లేక సద్గురువు ఆదేశాన్ని పాటించాలా అనే విచికిత్సే అతనికి కలుగలేదు. బాబాపై పూర్తి విశ్వాసంతో అతడు ఆరోజు ఆగిపోయాడు. తిరిగి ఆ మరుసటి రోజు అతడు సెలవు కోరినపుడు బాబా ఆశీర్వదించి, "ఇవాళ వెళ్ళి కలెక్టరును కలుసుకో" అన్నారు. అతడు కోపర్గాం చేరి ఆఫీసులో విచారించగా ఆ ముందటిరోజు కలెక్టర్ రానేలేదని చెప్పారు. తను ఆరోజు రావడం లేదని, మరురోజు వస్తాననీ కలెక్టర్ టెలిగ్రాం యిచ్చినట్లు ఆఫీసులో తెలిసింది.

నానా ఒకప్పుడు లేలేశాస్త్రి అను మిత్రునితో కలసి పూణే నుండి టాంగాలో ఎక్కడికో బయలుదేరాడు. కొన్ని మైళ్ళు వెళ్ళాక అకస్మాత్తుగా గుర్రం బెదిరి ఆ బండి పడిపోయింది. నిజానికి స్థూలకాయులైన ప్రయాణికులిద్దరికీ బాగా దెబ్బలు తగలవలసింది. కాని అదే సమయానికి శిరిడీలో బాబా తమ చేతులు శంఖంలాగా కలిపి ఊదుతున్నారు. ఆయనలా

చేయడం సామాన్యంగా ఎక్కడో ఎవరో భక్తులు మరణిస్తున్నారని సూచించేది. మరుక్షణమే ఆయన, "అరే, నానా చచ్చిపోబోతున్నాడు! కాని చావనిస్తానా?" అన్నారు. అక్కడ నానాకు, అతని మిత్రునికీ చిన్న దెబ్బయినా తగలలేదు.

తర్వాత ఒకరోజు యిద్దరు ముస్లిం స్త్రీలు దర్శనానికి వచ్చి బాబా చెంతనున్న మగవారు ప్రక్కకు తొలిగితే ఆయన దర్శనం చేసుకోవచ్చని ఆ ముంగిట్లోనే కొద్దిసేపు నిలుచున్నారు. కారణం వారు 'ఘోషా' అను ఆచారాన్ననుసరించి తమ ముఖాలకు పర్దా(ముసుగు) వేసుకున్నారు. బాబావంటి మహనీయులను దర్శించినపుడు అవి తొలగించుకోవాలి కాని పరాయి మగవారి ఎదుట ముసుగును తొలిగించుకోరాదని వారి మతధర్మం చెబుతుంది. అది గ్రహించిన నానా అక్కణ్ణుంచి వెళ్ళిపోబోయాడు. కాని బాబా అతనిని కూర్చోబెట్టి, "వారు దర్శించుకోదలచుకొంటే వస్తారులే! నీవు కూర్చో" అన్నారు. కొద్దిసేపు చూచి ఆ స్త్రీలిద్దరు బాబా దర్శనానికి వచ్చారు. ఇద్దరిలో వృద్ధురాలు మామూలుగానే పర్దా తొలగించుకొని బాబా దర్శనం చేసుకొన్నది. మధ్య వయస్కురాలైన రెండవ ఆమె సౌందర్యం నానా మనస్సును కలతపరచింది. ఆమె కళ్ళు ఎంతో తేజోవంతంగాను, ముఖమెంతో అందంగానూ వున్నాయి. ఆమె బాబాను దర్శించుకొని తిరిగి ముసుగు కప్పుకుని వెళ్ళిపోయింది. అందమైన ఆమె ముఖం మరొక్కసారి చూడగలిగితే బాగుండునని నానా మనసులో అనుకున్నాడు. వెంటనే సాయి అతని తొడపై గట్టిగా చరచి, "నేను ఎందుకు చరచానో అర్థమైందా?" అన్నారు. అప్పుడు నానా సిగ్గుపడి, "బాబా, నాకు మీ సన్నిధిలో గూడా యింత తుచ్ఛమైన భావాలెందుకు కలుగుతున్నాయి?" అన్నాడు. అపుడాయన, "నీవు మానవమాత్రుడవు. నీ దేహమంతా వాసనలతో నిండివుంటుంది, ఇంద్రియాలకు విషయాలు గోచరించగానే వికారాలు తలెత్తుతాయి. కాని అందమైన ఆలయాలెన్ని లేవు? మనము వాటి బాహ్య సౌందర్యంగాక లోపల దైవాన్ని దర్శించినట్లే జీవదేహాలనే ఆలయాల బాహ్యరూపాలనుగాక, వాటిలోపలుండే దైవాన్నే చూడాలి" అన్నారు.

నానా సాహెబ్ చందోర్కర్ ను మరొక విషయంలో గూడా సంస్కరించారు బాబా. మొదట ఎవ్వరిదగ్గరా ఎట్టి దక్షిణలు స్వీకరించని బాబా, ఒకప్పుడు భక్తులు సమర్పించిన దానిలో అతిస్వల్పంగా మాత్రమే తీసుకోనారంభించారు. భక్తుల సంఖ్య పెరిగే కొద్దీ వారినుండి ఆయన దక్షిణ అడిగి తీసుకోనారంభించారు. నానానుగూడ తరచుగా దక్షిణ అడిగి తీసుకొనేవారు. అతడు శిరిడీ వెళ్ళినపుడు సుమారు ₹.400/-లు తనవద్ద వుంచుకుని బాబా కోరినపుడు కోరినంత యిస్తుండేవాడు. క్రమంగా తానేదో బాబాకు సహాయం చేస్తున్నాననీ, దానికోసం బాబా తనపై ఆధారపడుతున్నారనీ తలచసాగాడు. ఈ భావాన్ని సాయి ఎలా తొలగించారో రేగే అనుభవాలలో వివరించాను.

ఇచ్చినమాటనిలుపుకోవాలన్నది బాబా చెప్పిన మూలసూత్రం. ఎవరైనా యాచిస్తే లేదని అబద్ధం చెప్పకుండా యథాశక్తి యివ్వాలని, అది బొత్తిగా వీలుగానప్పుడు సౌమ్యంగా యివ్వలేనందుకు కారణం చెప్పాలని, యివ్వడానికి ఏమీలేనపుడు అందుకభిమాన పడకూడదనీ ఆయన చెప్పేవారు. కారణం అందరికీ అసలైన దాత భగవంతుడే. అన్నీ మనకు ఆయన యిచ్చినవే. ఆయన మనతో ఎలా వ్యవహరించాలని ఆశిస్తామో అలా ముందుగా మనం సాటిజీవులతో వ్యవహరించాలి; అవి ఆయన రూపాలేగదా! ఒకప్పుడు కోపర్గాంలోని దత్తమందిరంలో ఒక ధర్మకార్యానికి ₹.300/-లు విరాళమిస్తానని ఒక సాధువుకు నానా వాగ్దానం చేశాడు. కాని అటుతర్వాత ఆ పైకం తెచ్చి వారికివ్వలేదు సరికదా, శిరిడీ వచ్చేటప్పుడు ఆ మందిరంవారికి తన ముఖం చూపవలసి వస్తుందని ఆ మందిరానికి వెళ్ళకుండానే శిరిడీ వచ్చాడు. అందుకోసం అతను ప్రత్యేకించి ఒక ముళ్ళబాటగుండా ప్రక్కదారిలో శిరిడీ చేరాడు. కాని సాయిబాబా ఎంతకూ అతనితో మాట్లాడలేదు. కారణమడిగితే, 'నేను చెప్పినది గుర్తుంచుకోనివారితో నేనెందుకు మాట్లాడాలి?" అన్నారు. "మీరు చెప్పినవన్నీ నాకు గుర్తున్నాయి" అన్నాడు నానా. "మీరు పెద్దమనుషులే! కాని దారిలో ఆ 'సర్కార్' ను చూడకుండా చుట్టూ తిరిగి వచ్చినది ఆ సాధువు ఆ ₹.300/-లు అడుగుతాడనేగా? నేచెప్పినది గుర్తు పెట్టుకునేది యిలాగేనా? నీదగ్గర డబ్బులేకపోతే, అది సర్దుబాటు చేయటం కష్టమైతే,

ఆమాట అతడితో చెప్పవచ్చుకదా? ఆ సాధువేమైనా నిన్ను తినేస్తాడా? అతడా డబ్బు అడుగుతాడని వెరచి దైవదర్శనమే మానుకోవడమేమిటి? ఇప్పుడు మాత్రం నీకాళ్ళల్లోనూ, వంటిమీద, నీ స్నేహితునికీ ముళ్లు గుచ్చుకోలా? ఇలాంటి వాళ్ళతో నేనెలా మాట్లాడను?" అన్నారు.

అంతేగాదు ఎవరైనా అడిగినపుడు అహంకారము, అధికారము లేకుండా దానం చేయాలని బాబా అతనితో చెప్పేవారు. అతడు గూడ జాగ్రత్తగా వుండేవాడు. కాని ఒకసారి కల్యాణ్ లో ఒక పేదరాలైన వృద్ధ బ్రాహ్మణ స్త్రీ వారింటికి భిక్షకు వచ్చింది. నానా భార్య ఆమెకు రెండుశేర్లు ధాన్యమిచ్చినా ఆమె తృప్తి చెందక, నాలుగుశేర్లిస్తేగాని అక్కడనుండి వెళ్ళనని చెప్పి వేధించసాగింది. అంతటితో విసుగుచెంది నానా, "ఇచ్చింది తీసుకుపోతావా, లేక జవానుచేత గెంటించమంటావా?" అని బెదిరించాడు. ఆమె వెళ్ళిపోయింది. ఆ తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు బాబా అతనితో ఎంతకూ మాట్లాడలేదు. కారణమడిగితే, "నీవు నేను చెప్పినది మరచిపోయావు. ఆ పేదరాలు యింకా యింకా యివ్వమని కోరితే అంత కోపగించుకొని నీ అధికారం చూపడమెందుకు? ఆ చెప్పేదేదో కొంచెం మర్యాదగా చెప్పవచ్చుగదా? కాకుంటే యింకొంచెం సేపు నిలబడి వెళ్ళిపోయేది గదా?" అన్నారు.

మనం కోరినవి భగవంతుడు తీరుస్తున్నాడు గదా అని అంతు లేకుండా పకృతి ధర్మాలకు విరుద్ధమైనవి కోరుతూండడంగాని, అవి ఆయన నెరవేర్చలేదని అలగడం గానీ తగదు. జీవితంలో యింతవరకూ ఆయన ప్రసాదించిన వాటికి చాలినంత కృతజ్ఞతగా వుండలేని మనకది అసలేతగదు. దాత యివ్వలేదని అలిగే హక్కు మనవంటి బిచ్చగాళ్ళకేమున్నది? నానా కుమార్తె మీనతాయి బిడ్డను కనిన కొద్దిమాసాల తర్వాత ఆమె భర్త, ఆ బిడ్డగూడ మరణించారు. వారిని రక్షించలేదని ఆ కుటుంబమంతా బాబాపై కష్టపడ్డారు. ఒకసారి ఆయనను దర్శించారుగాని ఆయనపై అలిగి ఆయనతో మాట్లాడలేదు. అపుడు బాబా, "మీకు ఆ బిడ్డ, అల్లుళ్ళే ప్రధానమై, అటువంటి వాటికోసం మాత్రమే వచ్చేటట్లయితే, మీరు నావద్దకు రానక్కరలేదు. జననమరణాలు పూర్వకర్మననుసరించి జరుగుతాయి. వాటిని భగవంతుడుగూడ మార్చడు. సూర్యుణ్ణి వేరొక దిక్కున ఉదయించమని ఆయన ఎన్నడైనా శాసిస్తాడా? అలాచేస్తే సృష్టి మొత్తం తారుమారవదూ?" అన్నారు. "అయితే మీరు ఒకరితో, 'నీకు బిడ్డ కలుగుతాడు' అనో, లేక 'నీకు ఉద్యోగం వస్తుంది' అనో అంటే అలా జరుగుతుందిగదా!" అన్నాడు నానా. బాబా "నేనెప్పుడూ మహిమలు చేయను. మీ జ్యోతిష్కులకంటే ఎక్కువ దూరం భవిష్యత్తులో జరగబోయేవి తెలిసి చెబుతాను. మీకిది తెలియక నేను లీలలు చేశాననుకొని నాపట్ల భక్తిశ్రద్ధలు వహిస్తారు. నేను వాటిని భగవంతునికి అర్పించి మీకు మేలు జరిగేలా చేస్తాను" అన్నారు. దైవాన్ని యింకేమీ కోరనక్కర లేకుండా వుండే స్థితి మనకివ్వాలన్నదే బాబాయొక్క ముఖ్య ఆశయం. అది అప్పటి నానాయొక్క మానసిక స్థితికి తగినట్లు యుక్తిగా చెప్పిన సమాధానమేగాని, పరమ సత్యంగాదని సాయి చేసిన లీలలన్నీ యోచిస్తే తెలుస్తుంది.

సద్గ్రంథాలు చదవడం వలన వివేక వైరాగ్యాలు పెంపొంది, నమ్రత కల్గుతేనే జన్మ సార్థకమవుతుంది. అలాగాక, విద్యాగర్వమేర్పడితే వ్యర్థమే. చక్కగా శాస్త్రాలు చదువుకొనడం వలన నానాకు ఏర్పడిన విద్యాగర్వాన్ని సాయి సంస్కరించారు. ఒక భగవద్గీతా శ్లోకానికి ఆయనెలా అర్థం చెప్పారో, అతిథిసేవ విషయంలోని ధర్మసూక్ష్మమెలా తెలిపారో, "శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర" లో చూచాము. అన్ని జీవులతోపాటు చీమలు, ఈగలు వంటి అల్పజీవులలోగూడ తామే వున్నామని సాయి అతనికెలా తెలిపారోగూడ ఆ గ్రంథంలో చూచాము. అతడు శ్రోత్రియ కుటుంబంలో పుట్టి పెరిగినందువలన, సాయిపట్ల ఎంత భక్తిశ్రద్ధలున్నా, నానాకు ఆయన ముస్లిమన్న అభ్యంతరమాత్రం మొదట్లో వుండేది. అందుకే భక్తులందరూ సాయి పాదాలు కడిగిన నీరు తీర్థంగా తీసుకుంటున్నా ఇతడు, దాసగణు మాత్రం తీసుకొనేవారుగాదు. కానీ ఈ దురభిప్రాయం క్రమంగా అతనికి తొలగిపోయింది.

# ద్వారకామాయి అనుభవమండపము

నేను 1966 నుండి డిసెంబరు 1969 వరకు తమిళనాడులోని మధురైలో రైల్వేలో ఇనస్పెక్టరుగా పనిచేశాను నా సెక్షన్ కొంత కేరళలోను, కొంత తమిళనాడులోను వుండేది. నా వద్ద రాధాకృష్ణమూర్తి అనే తమిళనాడులో స్థిరపడిన తెలుగు కుర్రవాడు పనిచేసేవాడు. అతనికి వివాహమై 10 సం॥లు గడిచినా సంతానము కలుగలేదు. తాను "క్విలాన్"కు 5 మైళ్ళలో వున్న ఒక గ్రామములో ఆశ్రమము నిర్మించుకొనిన ఒక స్వామి దర్శనార్థము తరచు వెళ్ళేవాడు. నన్నుకూడ రమ్మని తరచు ప్రాధేయపడేవాడు. మళయాళపు దేశము మంత్రతంత్రములకు ప్రసిద్ధి అంటారు. ఆ స్వామి ఎలాంటి వారో, అదీకాక సకలదేవతా స్వరూపియైన సాయిని పూజించేటప్పుడు ప్రత్యేకించి ఎవరి దర్శనమునకు వెళ్ళనక్కర లేదనుకొనే వాడిని. అతను రమ్మనుట - నేను చూద్దాములేయనుట ఈ విధముగా సుమారు రెండు సం॥లు గడిచినది. ఒకసారి నేను 'క్విలాన్' ఇనస్పెక్షనుకు వెళ్ళినపుడు అతడు నన్ను బలవంతముగా ఆ స్వామియున్న గ్రామమునకు తీసికొని వెళ్ళినాడు. చాలా విశాలమైన తోటలో వారి ఆశ్రమమున్నది. వాతావరణము ఎంతో ఆహ్లాదముగా యున్నది. సాయంత్రము 5 గం॥ కావచ్చినది. ఆ స్వామి రోజూ దేవీ పూజ చేసేవారు - సాయంత్రం భక్తుల ప్రశ్నలకు సమాధానము చెప్పేవారు. ఆయన నియమము ప్రకారము మొదట వచ్చిన 15మంది ఏమియు చెల్లించనవసరములేదు. ఆ తర్వాత వచ్చినవారు తలొక రూపాయి దేవీ పీఠముపై ఉంచిన డిబ్బీలోవేసి వరుసలో కూర్చునవలెను. రాధాకృష్ణ, నేను వెళ్ళేటప్పటికే సుమారు 25 గురు నిల్చొనియున్నారు. తనవంతు రాగానే అతడు డిబ్బిలో రూపాయి వేసి కూర్చున్నాడు. నేనుకూడ ఒక రూపాయి వేయబోగా "ఆగు! నీవు వేయవద్దు" అన్నారు. అలాగే కూర్చున్నాను. వారు అందరి ప్రశ్నలకు సమాధానము చెప్పి మా వంతు వచ్చేటప్పటికి రాత్రి సుమారు 8 గం॥లు అయినది. రాధాకృష్ణకు చెప్పవలసినది చెప్పి "నిన్నెందుకు రూపాయి వెయ్యవద్దన్నానో తెలుసా?" అన్నారు. నాకు తెలియదన్నాను. అప్పుడు మా సంభాషణ యిలా సాగినది.

"మీ యింట్లో ఒక శక్తిని పూజిస్తున్నావు. ఆ శక్తి నేను పూజించే శక్తికంటే ఎంతో బలవత్తరమైనది."

"నేను శక్తిని పూజించుటలేదు. నేను సామాన్య గృహస్తుని, మామూలు పూజతప్ప ఇంకేమి చేయుటలేదు".

"మీరే శక్తిని నిత్యము పూజిస్తారో గుర్తు చేసికొనండి" అని మమ్మూరన్నారు. ఇంతకంటే నాకేమియు గుర్తులేదన్నాను.

అప్పుడు ఒకటి రెండు నిమిషములు కన్నులు మూసికొని ధ్యానములోకి వెళ్ళి వారు "మీరొక బ్రహ్మచారియైన మహాశక్తిని పూజించుట లేదా?" అని అడిగారు. అప్పుడు కూడ నాకు గుర్తురాలేదు.

తిరిగి వారే అన్నారు "మీ మందిరములో ఎవరిని ప్రతిష్టించి నిత్యపూజ, నైవేద్యము చేస్తున్నారు?"

"శిరిడీ సాయిబాబా పటము, విగ్రహములను పూజా మందిరములోనుంచి నిత్యపూజ, నైవేద్యము చేస్తున్నాను" అన్నాను.

అప్పుడు వారన్నారు "ఏమయ్యా! శిరిడీ సాయి బ్రహ్మచారియా లేక గృహస్థా? ఆయన సామాన్య దైవమని నీ అభిప్రాయమా? ఆయన ఒక మహాశక్తి స్వరూపమని చెప్పినా నీకు అర్థమవలేదా? వారు సాక్షాత్తు భగవంతుడు. ఆ శక్తి ముందు ఇంకేశక్తియు నిలువదు. వారు మీ ఇంట్లోవుండి మీ యోగక్షేమములన్నియు చూస్తున్నారు. ఆ శక్తిముందు నేను పూజించే శక్తి

చాలా అల్పమైనది. కనుక నీవు అర్పించే రూపాయి స్వీకరించే అర్హత నాకు లేదు!" వారి వద్ద నుండి దేవి కుంకుమ తీసికొని తిరిగి వచ్చేటప్పుడు అన్నారు "నీవు నా వద్దకే కాదు. ఇంకెవరి వద్దకు ప్రశ్నల కొరకు వెళ్ళవద్దు. సాయిబాబా రక్షణ నీకు ఎల్లప్పుడూ ఉంటుంది." ఇదంతా విని రాధాకృష్ణ ఎంతో ఆశ్చర్యపోయాడు. నేను కూడా నేను పూజించే సాయినాథుని అనంత శక్తిని ఈ స్వామి నన్ను చూడగానే గుర్తించినందులకు చాలా సంతోషించి, సెలవు తీసికొని వచ్చినాము.

ఆ మరుసటి గురువారము రాధాకృష్ణ ఒక పెద్ద పనసపండు తీసుకొని వచ్చి నా పూజకు వచ్చినాడు. రెండు నెలల తర్వాత నేను శిరిడీ వెళ్ళేటప్పుడు ఒక కొబ్బరికాయ అతని వద్ద నుండి తీసుకుని అతని తరపున కూడ పూజచేసి సమాధి మందిరములో దానిని సాయి స్పర్శచే పవిత్రముచేసి ఇంటికి వచ్చిన తర్వాత అతనికిచ్చితిని. దానిని కొట్టి భార్యభర్తలిరువురూ తిన్నారు. పది సం॥లుగా సంతానము లేనివారికి ఒక సంవత్సరములో సంతానము కలిగినది. వారి ఆనందమునకు మేరలేదు. అతడు చాలా అందమైన పూజా మందిరము తయారుచేసి సాయి విగ్రహము ప్రతిష్టించి నిత్యపూజలు ప్రారంభించినాడు.

1969 డిశంబరులో నాకు 'మధురై' నుండి 'ఈరోడ్' కు బదిలీ అయినది. వెళ్ళే ముందు రాధాకృష్ణతో కలసి మరొకసారి స్వామి దర్శనమునకు వెళ్ళితిని. నేనేదో ప్రశ్న కొరకు వచ్చాననుకొని "నీవు నా వద్దకే కాదు ఇంకెవరి వద్దకూ ప్రశ్నకొరకు వెళ్ళవద్దన్నాను గదా! ఎందుకు వచ్చావు?" అన్నారు. నాకు బదిలీ అయినదనీ చివరిసారిగా వారి దర్శనము కొరకు వచ్చినానని చెప్పినాను. వారు సంతోషించి ముమ్ములనాశీర్వదించినారు. అనంత శక్తిస్వరూపుడైన సాయికి జోహారులర్పించి తిరిగి వచ్చినాము.

**కె.వి.ఎస్. సుబ్రహ్మణ్యం,**
**రాజమండ్రి**

---

నేను నా ఉద్యోగ విధి నిర్వహణలో అనేక ప్రదేశాలు తిరుగుతూ ఉంటాను. 8.1.87 రాత్రి 10.30 ని॥లు వనపర్తిలో ఉండగా మా గ్రామంలో నా మాతామహులు శ్రీ అంబా పెద అంకమ్మగారు కాలం చేసారని నేను వెంటనే బయలుదేరి స్వగ్రామం చేరాలని నా పై అధికారుల నుండి వార్త అందింది, నేను వెంటనే 'సాయి' ని "తండ్రీ! ఎందరినో మరణించిన వారిని బ్రతికించావు. నీవు ఏమైనా చేయి. నేను వెళ్ళేసరికి తాతగారు మాట్లాడాలి" అని ప్రార్థించాను. బయలుదేరి స్వగ్రామం చేరేసరికి తాతగారు కొన ఊపిరితో వున్నారు. నేను వెంటనే నాన్నగారిని "విభూతి పెట్టారా?" అని అడిగాను. లేదన్నారు. వెంటనే ఉదీ పెట్టి తులసి నీళ్ళువేయగా నాలుగు రోజులనుండి గుటకవేయని ఆయన నాచేతి నీళ్ళు మ్రింగారు. సాయంత్రం మరల స్నానంచేసి ఉదీ పెట్టి తాతగారి తల నా ఒడిలో వుంచుకొని 'రామ' నామాన్ని ఉచ్చరించాను. ఎన్నో రోజులుగా కదలని అయన ఎడమచేయి కాలు కదిలించి నా స్వరంలోని ఆరోహణ అవరోహణులకు అనుగుణంగా చిటికెలు వేస్తూ, ఆయన రామనామం చేసారు. అలా మరురోజు అనగా వైకుంఠ ఏకాదశి రోజున (10.01.87) మధ్యాహ్నం 12 గం॥లకు తుదిశ్వాస వదిలారు.

మరుదినము కర్మరోజు భోజనాల సమయంలో ఒక వ్యక్తి నేరుగా ఇంట్లోకి వచ్చారు. అమ్మమ్మ ఎక్కడకు వెళ్తున్నావనగా, "నన్ను అంటావా!" అని వెళ్ళిపోయారు. తరువాత మరలా వచ్చారు. నేనే స్వయంగా వడ్డించాను. నాకు తీపి చాలా ఇష్టమని చెప్పారు. "తృప్తిగా భోజనం చేసాను నాయనా!" అని ఆశీర్వదించి వెళ్ళారు. వెంటనే మా అమ్మమ్మ గారు "వచ్చినది సాయి రా" అని గట్టిగా నాతో చెప్పింది. "మొదట వస్తే నేను వెళ్ళిపోమన్నాను. సాయీ, ఆ వచ్చినది నీవే అయితే మరలా వచ్చి భోజనం చేయమని ప్రార్థిస్తూ కూర్చున్నాను. అందుకే మరలా వచ్చారు" అని ఆయన వెళ్ళాక చెప్పింది. తర్వాత ఎంత వెతికినా ఆయన కనిపించలేదు. సాయికి ఇష్టమైన సూత్రాన్ని సాయి ఎవరో తెలియకపోయినా జీవిత పర్యంతము పాటించి, ఆకలిగొని వచ్చిన ఏ ప్రాణిని కాదనక అన్నం పెట్టిన ఆయనను సాయి స్వయంగా వైకుంఠ ఏకాదశి పర్వదినాన చెయ్యి పట్టుకొని తన సన్నిధానానికి తీసుకొని వెళ్ళారని మా కుటుంబ సభ్యులందరము ఎన్నో విధాల సాయికి నమస్కరించుకున్నాము.

**వై.శివరామకృష్ణ,**
**హైదరాబాదు**

# ఆచార్యుని అద్భుత లీలలు

సికింద్రాబాదులో వుంటున్న శ్రీమతి కల్పనగారు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఈ విధంగా తెలియచేస్తున్నారు ---

నేను సికింద్రాబాదులోని మహంకాళి గుడి ఎదురుగా వున్న చిన్న బట్టలకొట్టులో పనిచేస్తాను. ఒకరోజు శ్రీమతి అరుణగారు అనే ఆవిడ ఒక ఫ్రాక్ కొనడానికి మా కొట్టుకి వచ్చారు. ఇదివరకు కూడా ఒకటి రెండు సార్లు వచ్చారు. నాకు ఆవిడతో బాగానే పరిచయం వుంది. ఆ రోజు ఆవిడ వచ్చేసరికి దాదాపు సాయంత్రం 6 గంటలవుతోంది. ఒక ఫ్రాక్ బేరం చేశారు కానీ ఆ ఖరీదుకు నేను ఇవ్వనన్నాను. "సరేలే!" అని వెళ్ళిపోబోయారు. నేను మళ్ళీ వెనుకకు పిలిచి, "మీరు దీపాలు పెట్టగానే వచ్చారు. బేరం తిప్పి పంపకూడదు, తీసుకోండి!" అన్నాను.

నేను ఆ ఫ్రాక్ ప్యాకింగ్ చేస్తుంటే ఆవిడ నన్ను చూసి, "మీరు ఏదోలా వున్నారు. అంత రేటు పడకపోతే ఇవ్వద్దులెండి!" అన్నారు. "అబ్బే అదేమీ కాదండి! మనసు బాగోలేదు, అందుకే అలా వున్నాను" అన్నాను. వెంటనే ఆవిడ, "బాబాని నమ్ముకోండి, బాధలన్నీ పోతాయి!" అన్నారు. "నేను ఆయననే నమ్ముకుంటాను, అయినా నా బ్రతుకు ఇలాగే వుంది!" అన్నాను కొంచం విసుగ్గా. అప్పుడు ఆవిడ, "మీకు అభ్యంతరం లేకపోతే నాకు ఏమి జరిగిందో చెప్పండి!" అన్నారు. "ఏమి లేదండీ, అందరి ఇళ్ళల్లో వుండేదే! నాకు, మా ఆయనకీ గొడవ జరిగింది. చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఇప్పటికి 12 రోజులైంది. ఏమయ్యాడో తెలియదు. ఇద్దరు పిల్లలున్నారు. మాకు ఈ ఉద్యోగం ఒక్కటే ఆధారం. దానిగురించే బాధపడుతున్నాను" అన్నాను.

ఆవిడ ఒక నిమిషం ఆలోచించి, "శ్రీ సాయిలీలామృతం పారాయణ చేశారా?" అని అడిగారు. "ఒకసారి చదివాను" అని చెప్పాను. ఆవిడ వెంటనే తన సంచీలోనించి ఒక చిన్న పుస్తకం తీసి నాకు ఇచ్చి, "ఇది పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి అమ్మాయి వ్రాసిన 'సమర్థ సద్గురువు' అనే గ్రంథం. దీనిలో పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి వుంటుంది. ఈయన కూడా బాబా అంతటి సమర్థుడే! నమ్మకం పెట్టుకుని ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ప్రతిరోజూ చదువుకోండి. కనీసం ఒకసారి అయినా చదవండి!" అని ఆ పుస్తకాన్ని నాకు ఇచ్చారు. నేను వారి అమ్మాయి పేరు చూసి, "వీళ్ళు ఎక్కడ వుంటారు?" అని అడిగాను. ఆమె, "నాగోలులోని జైపురికాలనీ" అని చెప్పారు. నేను వెంటనే, "మా అక్క అక్కడే వుంటుంది. తను టైలర్" అని చెప్పాను. "అలాగా!" అని, "ఈ పుస్తకం మాత్రం శ్రద్ధగా చదవండి!" అని చెప్పి వెళ్ళిపోయారు.

ఆమె వెళ్ళాక ఆ పుస్తకం చదవడం మొదలు పెట్టాను. చాలా బాగా అనిపించి మళ్ళీ మళ్ళీ చదివాను --అంటే 4, 5 సార్లు చదివేశాను. ఆ రోజు రాత్రి 10 గంటల సమయంలో నాకు తెలిసిన వాళ్ళ దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. మా ఆయన వాళ్ళ ఇంటికి వచ్చాడని, నా దగ్గరకు రావాలనుకుంటున్నాడనీ చెప్పారు! నేనొక్కసారిగా ఆశ్చర్యపోయాను. కొంచెం తేరుకుని సరేనని చెప్పాను. అప్పుడు ఆలోచించాను.... ఇన్నాళ్లూ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించనిది ఈరోజు అప్రయత్నంగా మా ఆయన ఆచూకీ తెలిసింది. ఇదంతా ఆ పుస్తకం చదవడం వల్లే జరిగింది. 'ఈయనెవరో సామాన్యులు కారు!' అనిపించి అప్పుడు మనస్ఫూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం

చేసుకున్నాను.

ఆ పుస్తకం చదువుతున్నప్పుడు నాకు ఒకటి అనిపించింది ----'ఈ గొడవలో నా తప్పు కూడా వుంది! మా ఆయనది మాత్రమే తప్పు కాదు. నేను సరిదిద్దుకోవలసినవి చాలా వున్నాయి' అని! మర్నాడు ఉదయమే మా ఆయన మా ఇంటికి వచ్చారు! అప్పుడు శ్రీమతి అరుణ గారికి ఫోన్ చేసి సంతోషంగా ఈ విషయం చెప్పాను. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి కరుణకు నాకెంతో కృతజ్ఞతగా అనిపించింది.

జరిగినదంతా ఒకసారి తలచుకుంటే -- నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఎవరో తెలియకపోయినా మా కొట్టుకి అరుణగారిని పంపించి, ఆ గ్రంథం రూపంలో నాదగ్గరికి వచ్చి నా కాపురాన్ని నిలబెట్టినందుకు వారికి పాదాభివందనములు !!

జై సాయి మాస్టర్ !

**-శ్రీమతి కల్పన,**
**సికింద్రాబాద్**




అమెరికాలోని కేలిఫోర్నియా, శాంజోస్ లో వుంటున్న ఒక భక్తురాలు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఈ విధంగా తెలియచేస్తున్నారు --

మా స్వస్థలం హైదరాబాదు. మేము గత 20 సంవత్సరాలుగా కేలిఫోర్నియాలో వుంటున్నాము. నా జీవితాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు, బాబా ఎలా మలుపులు తిప్పారో ఊహించుకుంటే నాకే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. నేను శ్రీ సాయిలీలామృతము, శ్రీ గురు చరిత్ర పారాయణ చేసేదానిని. పూజ్యశ్రీ మాస్టరుగారి ఇతర రచనలు కూడా వీలున్నప్పుడు చదువుతూ వుండేదాన్ని. మా ఇంటికి దగ్గర్లో బాబా గుడి వుండేది.

నాకు వివాహం చేశారు. కానీ దురదృష్టవశాత్తు పెళ్లి జరిగిన మరునాడే గొడవలు జరిగాయి. మాకు అబ్బాయివాళ్ళు చాలా అబద్ధాలు చెప్పి మోసంతో నా పెళ్లిచేశారని తెలిసి విడిపోవడం జరిగింది. నాకు మనసంతా అల్లకల్లోలంగా అయిపోయింది. 'ఏమిటి మాస్టరుగారు ఇలా చేశారు?' అని బాబా మీద, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద కొన్నాళ్ళు చాలా కోపంగా వుండేది.

తరవాత నెమ్మదిగా వాళ్ళు, వీళ్ళు చెప్పగా, చెప్పగా మళ్ళీ పారాయణలు మొదలుపెట్టాను. ప్రతిరోజూ బాబా గుడికి వెళ్లడం, నాలుగు హారతులు

చేసుకోవడం, పారాయణ చేసుకోవడం, నలుగురిని పిలిచి సత్సంగాలు చేసుకోవడం --- ఇలా వుండేది నా దినచర్య. కొన్నాళ్ళకి మావాళ్ళు మళ్ళీ పెళ్లి చేస్తామన్నారు. నాకేమో కొద్దిగా భయంగానే వుండేది. 'కానీ ఎన్నాళ్ళు ఇలా



వుంటాను?' అనిపించేది. ఇలా ఆలోచిస్తూన్న సమయంలో ఒకసారి బాబా కలలో కనిపించి, "నీకు వైధవ్యం వుంది!" అని చెప్పారు. నాకు విపరీతంగా భయమేసింది. 'ఏమిటి ఏదో సమాధానపడి పెళ్లి చేసుకుందామనుకుంటే బాబా ఇలా చెప్పారు?!' అని చాలా బాధపడ్డాను. ప్రయత్నాలు చెయ్యమనాలా వద్దా? మళ్ళీ అయోమయ పరిస్థితి.

ఇలా వుంటుండగా ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో కనిపించి, " ఎందుకు ఊరికే భయపడతావు? నీకోసం నేను ఎన్ని పూజలు చేస్తున్నానో తెలుసా? ఏమీ కాదు!" అన్నారు! నాకు ఇంక విపరీతంగా ధైర్యం వచ్చేసింది. మావాళ్లకి ప్రయత్నాలు మొదలుపెట్టమని చెప్పాను. కొన్నాళ్ళకి ఒక అమెరికా సంబంధం వచ్చింది.

ఇక్కడ మావారి గురించి కొంత చెప్పాలి. ఆయన తన జీవితాన్ని ఆధ్యాత్మికంగా గడపాలన్న ఉద్దేశంతో ఇంట్లో అందరికీ పెళ్లిచేసుకోనని చెప్పారట. ఎవరో మా సంబంధం గురించి చెబితే కూడా వాళ్ళకీ అదే సమాధానం చెప్పారట. కానీ వారికి నన్ను చేసుకొమ్మని స్వప్నంలో ఆదేశం వచ్చిందట. అప్పుడు వారు ఒప్పుకోవడం, నా పెళ్లి జరగడం, నేను కేలిఫోర్నియా వెళ్లిపోవడం జరిగింది. నాకు ఇద్దరు పిల్లలు --- ఒక పాప, ఒక బాబు. బాబుకి 18 ఏళ్ళు, పాపకి 16 ఏళ్ళు. అయితే ఇక్కడే ఒక సంఘటన జరిగింది. ఈ మధ్యనే మావారు చనిపోయారు.

కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే నా జీవితంలో అనివార్యమైన నా వైధవ్యాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు కొంతకాలం వాయిదా వేసి నేను కోరుకున్న వైవాహిక జీవితాన్ని నాకు ప్రసాదించి, ఇప్పటి జీవితంలో ఒక నిలకడ కలిగాక వారి గురువైన శ్రీ సాయినాథుడు చెప్పినది అమలు చేశారు!

పూజ్య గురుదేవుల దయవలన ఇప్పటివరకూ ఎలాంటి అసంతృప్తి లేని సంతోషకరమైన జీవితాన్ని గడిపాను. నిజానికి నేను వారికి చేసినది, చేస్తున్నది చాలా తక్కువ. ఇప్పుడు నాకు ఎదురైన పరిస్థితి చాలా బాధాకరమే అయినా, వారు నాకు ప్రసాదించినదానికి కృతజ్ఞత కలిగివుండే మానసికస్థాయిని నాకు అనుగ్రహించి బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను నడిపిస్తారని నమ్ముతున్నాను. అసలు నావరకు నాకు పూజ్యశ్రీ మాస్టరుగారికి, శ్రీ సాయినాథునికి బేధం లేదనిపిస్తుంది. వారి రక్షణ ప్రతి జన్మలోను అనుగ్రహించమని వేడుకుంటున్నాను.

జై సాయి మాస్టర్ !!

*-ఒక భక్తురాలు,*
*కేలిఫోర్నియా, శాంజోస్*

# పరిప్రశ్న

10వ పేజీ తరువాయి

జీవితచరిత్ర' - యివి వేర్వేరు మహాత్ముల చరిత్రలని భ్రమించగూడదు - ఒకే దత్తస్వామి యొక్క చరిత్రలో వేరు అధ్యాయాలుగా మాత్రమే తలచి పారాయణ చేస్తేనేగాని ఆయన మహాత్మ్యము మన హృదయాలకు అవగతంకాదు, చాలినంత భక్తి కుదరదు. వీటిలో ఏది పారాయణ చేయక విడిచినా సాయి చరిత్రలో కొన్ని భాగాలు చదవకుండా విడిచినట్లే. అది సరియైన భక్తి ఎలా అవుతుంది? ఈ సత్యాన్ని మరువకుండానే మీరు ప్రస్తావించిన అంశాలను సమన్వయం చేసుకోవాలి

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

SRI GURUPADUKA PUBLICATIONS,
C/O SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |

**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**





Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



మార్చి 6, 2021 న నాగోలు లో జరిగిన పూజ్య గురుదంపతులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారు,
శ్రీమతి అలివేలుమంగతాయారు గార్ల కల్యాణ మహోత్సవ వేడుకలు.